విశాఖపట్టణం
గురువారం 13 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 201 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## జస్టిస్ యశ్వంత్ వర్మ దోషే

తేల్చిన లోక్ సభ కమిటీ

ఇంట్లో భారీగా నగదు వ్యవహారం

దేశవ్యాప్తంగా సంచలనం

స్పీకర్ ఓం బిర్లాకు నివేదిక



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

న్యూఢిల్లీలోని 30, తుగ్లక్ క్రెసెంట్‌లో ఉన్న జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో గత ఏడాది మార్చి 14 రాత్రి ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం ..మిగతా 2లో



## మండలిలో నిలదీద్దాం.. బయట పోరాడుదాం!

ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిందే

కేసులపై న్యాయపోరాటం చేద్దాం

మండలి చైర్మన్ అభ్యర్థిగా మాధవరావు

శాసనసభాపక్ష సమావేశంలో వైఎస్ జగన్

(తాడేపల్లి - జయజయహే)

వైఎస్సాఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని పార్టీ ఆఫీస్‌లో శాసనసభా పక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో నడుస్తున్న రాజకీయాలు, ప్రభుత్వం నడుస్తున్న తీరుపై విమర్శలు చేశారు. ప్రజాసమస్యపై గళమెత్తాలని సభ్యులకు సూచించారు. శాసనసభలో 40 శాతం ఓట్లు పొందిన పార్టీగా వైఎస్ఆర్సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడానికి ప్రభుత్వం నిరాకరించడాన్ని జగన్ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రతిపక్ష హోదా ఇస్తే సభలో మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వాల్సి వస్తుందని ఆ భయంతోనే చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన ఆరోపించారు. అసెంబ్లీలో మాట్లాడే అవకాశం లేకపోయినా, ప్రభుత్వం ప్రస్తావించే ..మిగతా 2లో

## నేడు కర్నూలుకు జగన్

ఎమ్మెల్యే విరూపాక్షికి పరామర్శ

2


# గ్రామాల్లోనూ పరిశ్రమల స్థాపన

ప్రోత్సాహకాలు ప్రాక్టికల్ గా ఇద్దాం

రూ. 2,08,406 కోట్ల పెట్టుబడులకు ఓకే

21,627 మందికి ఉద్యోగ అవకాశాలు

ఎస్ఐపీబీలో సీఎం చంద్రబాబు నాయుడు





(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఆర్థిక పురోగతి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 20వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రూ. 2,08,406 కోట్ల విలువైన 25 భారీ పెట్టుబడి ప్రతిపాదనలకు ఈ సమావేశంలో బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలో పరిశ్రమలను మరింత ప్రోత్సహించేందుకు డిసెంబర్ నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను నేరుగా 'ఎస్క్రో ఖాతాల' లోకి జమ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూనే, ప్రాక్టికల్‌గా ఎంత మేరకు ప్రోత్సాహకాలు ఇవ్వగలమో నిర్ణయించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఆయా ప్రాంతాల సమగ్ర వికాసానికి బాటలు వేయాలని తెలిపారు.

**సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**

గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాలలో కొత్త పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం సూచించారు. శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు నిర్మాణ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేసి, అదే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు అందుబాటులోకి వచ్చేలా మిగిలిన 37 పార్కుల నిర్మాణాన్ని ఈ ఏడాది సెప్టెంబర్ నాటికల్లా పూర్తి చేయాలని గడువు విధించారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ..మిగతా 2లో

# పార్లమెంట్‌లో చర్చకు లేవనెత్తుతాం

పంచదర్లను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాల్సిందే

రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు డిమాండ్

అక్రమ తవ్వకాలపై కేంద్ర బృందం అధ్యయనం చేస్తుంది

నివేదిక అధారంగా 10 రోజుల్లో చర్యలకు కేంద్ర మంత్రులు హామీ

అరకు ఎంపీ గుమ్మా తనూజా రాణి స్పష్టీకరణ



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

అనకాపల్లి జిల్లా పంచదార్లలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై వైఎస్సార్ సీపీ నేతలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసారు. పంచదార్లను శాశ్వత నో మైనింగ్ జోన్ గా ప్రకటిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయకుంటే పార్లమెంట్ లో ఈ అక్రమ తవ్వకాలు, సహజ వనరుల దోపిడీపై పార్లమెంట్ కు చర్చకు లేవనెత్తుతామని నేతలు ప్రకటించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, అరకు ఎంపీ తనూజా రాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్, ..మిగతా 2లో

# విశాఖలో పవన్

జాతీయ ఏనుగుల దినోత్సవ కార్యక్రమానికి హాజరు

(అమరావతి - జయజయహే)



ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా గురువారం విశాఖపట్నంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి వేడుకలకు తాను హాజరవుతున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు. రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ వేడుకలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కూడా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి రాజధాని పరిధిలో చేపట్టనున్న పలు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా మంత్రి నారాయణ ఆహ్వానం అందించారు. అమరావతి రాజధాని నగర సమగ్ర అభివృద్ధిలో 'సీడ్ యాక్సెస్ రోడ్డు' అత్యంత కీలకమైన భాగమని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.



## అమరావతిలో కీలక ముందడుగు

నేడు సీడ్ యాక్సిస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిలు ప్రారంభోత్సవం

జయజయహే)

అమరావతిలోని సీడ్ యాక్సిస్ రోడ్డు, రెండు స్టీల్ బ్రిడ్జిలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్నారు. అమరావతిలో కీలకమైన 9 లేన్ల రహదారిగా సీడ్ యాక్సిస్ రోడ్డును ప్రభుత్వం నిర్మిస్తుంది. ఈ రోడ్డుకు సెంట్రల్ బీఆర్ టీ ఎస్ తో పాటు ఇరువైపులా 11 మీటర్ల వెడల్పుతో సర్వీస్ రోడ్లను నిర్మించనుంది. అమరావతిలో ఉత్తరం నుంచి దక్షిణానికి వెళ్లే చీ1 నుంచి చీ17 రోడ్లన్నీ సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానం చేయనుంది. దొండపాడు నుంచి తాడేపల్లి వరకు చీఎ-16కు సీడ్ యాక్సిస్ రోడ్డు అనుసంధానం కానుంది. ఈ రోడ్డు 21.77 కిలోమీటర్ల మొత్తం పొడవు ఉంది. మూడు దశల్లో ఈ రోడ్డును ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంది. ఫేజ్-1లో దొండపాడు నుంచి వెంకటపాలెం మంతెన ఆశ్రమం వరకు 14.35 కిలోమీటర్ల వరకు ..మిగతా 2లో

# వాళ్లకెందుకు ఎమ్మెల్యే పదవులు

అసెంబ్లీకి రాకుంటే శాసనసభ్యులు ఎలా

వైసీపీ సభ్యుల సభ్యత్వం రద్దుపై చర్చిస్తున్నాం

ఇండిపెండెన్స్ రోజుల్లో అసెంబ్లీ చూడొచ్చు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు



(అమరావతి - జయజయహే)

ప్రభుత్వం ఇండిపెండెన్స్ డే వేడుకలకు ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఆగస్టు 14, 15 తేదీల్లో ఇండిపెండెన్స్ డే సందర్భంగా అసెంబ్లీకి వచ్చి వీక్షించవచ్చు అని ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. పిల్లలతో పాటు వచ్చి అసెంబ్లీని వీక్షించేందుకు అవకాశం కల్పిస్తున్నామని, అందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రావడం లేదని, అలాంటివి వాళ్లకు ఎమ్మెల్యే పదవి ఎందుకు.. సభ్యత్వం రద్దు చేసే అంశం చర్చల స్థాయిలో ఉందన్నారు. డ్యూటీ చేయని ఎమ్మెల్యేలకు జీతాలు కట్ చేసేలా కేంద్రం చట్టం తేవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర శాసనసభ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టానికి శ్రీకారం చుడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజాపండగలా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో నందమూరి తారకరామారావు తరచూ చెప్పే "మన సభ -- జన సభ" అనే స్ఫూర్తితో అసెంబ్లీ గేట్లను ప్రజల కోసం తెరవనున్నట్లు ఆయన ప్రకటించారు. నిబంధనల ప్రకారం సభలో అవసరమైనంత ..మిగతా 2లో

## 20 వేల పేజీలతో చార్జ్‌షీటు

360 మంది సాక్షులు, 422 డాక్యుమెంట్లు, 43 భౌతిక సాక్ష్యాలు

నీట్ పేపర్ లీక్ కేసులో సీబీఐ అభియోగపత్రం

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

నీట్- యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని దిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 13 మంది నిందితులపై దర్యాప్తు సంస్థ సమర్పించిన ఛార్జ్‌షీట్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా పరిశీలించారు. పేపర్ లీక్‌లపై విచారణకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఇటీవలే సీబీఐ తుది ఛార్జ్ షీట్‌ను వేసింది. 13 మంది నిందితులపై ..మిగతా 2లో





# టెట్ పరీక్షల నుంచి మినహాయింపు ఇవ్వాలి

అనకాపల్లి జయ జయహే

అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీసులో జిల్లా రెవెన్యూ అధికారి వైఎస్ వి కే జి ఎస్ సత్యనారాయణ కి అనకాపల్లి జిల్లా యు టి ఎఫ్ నాయకులు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ బుధవారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు శ్రీమతి వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ 2010 కంటే ముందు సర్వీసుల చేరిన ఉపాధ్యాయులందరికీ టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు రిటైర్మెంట్ కు సమీపంలో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ రాయాలని నిబంధన పెట్టడం వల్ల వారి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె పేర్కొన్నారు కాబట్టి వెంటనే ప్రభుత్వం ఈ విషయమై పునరా ఆలోచన చేసి విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23(1) నో సవరించి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని అన్నారు అలా కానప్పుడు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అర్హత మార్కులు తగ్గించి ఏ సబ్జెక్టు బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఆ సబ్జెక్టులోనే పరీక్షల నిర్వహించాలని కోరుతూ కలెక్టర్ ఆఫీసులో రెవెన్యూ అధికారి వారికి వినతి పత్రం అందజేయడం జరిగిందని వారు పేర్కొన్నారు ఈ సందర్భంగా రెవిన్యూ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ సదరు విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని వారు తెలియజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు రంగలి అక్కు నాయుడు జిల్లా కార్యదర్శులు గుత్తుల సూర్య ప్రకాష్ ఉప్పాడ రాము వైరాల రమేష్ సీనియర్ నాయకులు జి కె ఆర్ స్వామి అలివేలు మామిడి బాబురావు బండారు శంకర్రావు రవి గొంది ఈశ్వరరావు సలీం గణేష్ తదితరులు పాల్గొన్నారు



# "ప్రతీ గ్రంధాలయం" ఒక దేవాలయం

**- నేటి యువత పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి.**

**- గ్రంధాలయాధికారి పెద్దిన.కమల్ కుమార్**

అరసవల్లి కూడలి (జయ జయహే)

ప్రతీ గ్రంధాలయం, ఒక దేవాలయమని, కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ అన్నారు. అరసవల్లి కూడలి, స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవంను నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ డాక్టర్.ఎస్ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఇందులో భాగముగా ప్రిన్సిపాల్ శివశంకర్ మాట్లాడుతూ ఒక కళాశాలలకు గ్రంథాలయం హృదయం వంటిదని, దాన్ని నిర్వహించే గ్రంథపాలకుడు చాలా ముఖ్యమైన వారన్నారు. అదేవిధంగా రంగనాథన్ గ్రంథాలయాలు కోసం చేసిన సేవలను కొనియాడారు. రంగనాథన్ ప్రవేశ పెట్టిన ఫైవ్ లాస్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ గ్రంథాలయ శాస్త్రానికి ఒక ముఖ్య గ్రంథం వంటిదని, ఆయనొక వెన్నుముఖన్నారు. గ్రంథపాలకులు కూడా ప్రస్తుతం ఉన్న శాస్త్ర సాంకేతిక పై పట్టు సాదించి, విద్యార్థులకు మార్గదర్శకాలుగా ఉండాలన్నారు. గ్రంథాలయశాస్త్రానికి ఎంతో కృషి చేసిన రంగనాథన్ జయంతిని జాతీయ గ్రంథపాలకుల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. కళాశాల గ్రంధాలయాధికారి పెద్దిన.కమల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినిలు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నేటి యువత పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు, ఎన్ఎస్ఎస్ పిఓ లు పైడి రాజు, జగన్నాథం విద్యార్థినిలు పాల్గొన్నారు.

# వాళ్లకెందుకు ఎమ్మెల్యే పదవులు

**మొదటి పేజీ తరువాయి...**

సంఖ్యాబలం లేనప్పుడు ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యపడదని, అది పూర్తిగా స్పీకర్ విచక్షణ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రితో సమానంగా ప్రతిపక్ష నేతకు సమయం కేటాయించడం కుదరదని, చట్టసభలోని ప్రతి సభ్యుడికి మాట్లాడే అవకాశం సమపాళ్లలో లభిస్తుందని స్పీకర్ గారు స్పష్టం చేశారు.

**ఆ రోజుల్లో వచ్చి అసెంబ్లీ చూడొచ్చు**

అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 14, 15, జనవరి 26 వంటి రోజులు మనకు ఎంతో ముఖ్యమైన పండుగ రోజులని పేర్కొన్నారు. స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత స్కూలు పిల్లలకు, సాధారణ ప్రజలకు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల సమయంలో అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశం లేకపోవడాన్ని గమనించాను. అయితే ప్రజలు లేని చోట కేవలం లైటింగ్ పెట్టి ఉత్సవాలు నిర్వహించడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. అందువల్ల ఇండిపెండెన్స్ డే సందర్భంగా ఈ రెండు రోజుల్లో సాయంత్రం వేళల్లో అసెంబ్లీ గేట్లు తెరిచే ఉంచుతామని, ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా స్కూలు పిల్లలతో సహా ప్రజలంతా వచ్చి అసెంబ్లీని వీక్షించవచ్చునని తెలిపారు. అసెంబ్లీ అందరిదీ కాబట్టి ప్రజలంతా ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలనే ఈ ఏర్పాటు చేశామని, లోపలికి రావడానికి అనుమతి ఉన్నప్పటికీ ఫోన్లను మాత్రం అనుమతించమని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆ రెండు రోజుల్లో ప్రత్యేకంగా పోలీస్ బ్యాండ్ ప్రదర్శన కూడా ఉంటుందని తెలిపారు.

**ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి**

మరొక వైపు, వరుసగా 60 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాని ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయాలనే అంశంపై చర్చ జరగాలని కోరుతూ కేంద్రానికి నివేదిక పంపినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. కొంతమంది ఎమ్మెల్యేలు సభకు వరుసగా గైర్హాజరవుతూ చివరి నిమిషంలో వచ్చి సంతకాలు చేసి వెళ్తున్నారని విమర్శించారు. వైఎస్ఆర్‌సిపి నేత బొత్స సత్యనారాయణ మాజీ సీఎం జగన్ కంటే సీనియర్ నాయకుడని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోమని నన్ను అడిగే బదులు తమ 11 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తన వద్దకు పంపవచ్చని వ్యాఖ్యానించారు. జగన్ ప్రతిపక్ష సీటు కాకుండా ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని, అయితే అసెంబ్లీ నిబంధనల ప్రకారం అది సాధ్యం కాదని తేల్చి చెప్పారు.

# మండలిలో నిలదీద్దాం.. బయట పోరాడుదాం!

**మొదటి పేజీ తరువాయి...**

ప్రతి అంశానికి ఆధారాలతో ప్రెస్‌మీట్‌లు ద్వారా ప్రజలు వివరిద్దామని అన్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చాలా కాలంగా వైసీపీ విమర్శలు చేస్తోంది. మెరిట్ లిస్ట్‌లో జరిగిన మార్పులు, అక్రమాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని జగన్ ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా పేరుతో జీవోలు జారీ చేసి, పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు ఇచ్చేలా కుట్రలు చేశారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరగాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండే చేశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు నిలిపివేయడంపై జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో త్రైమాసికానికి 700 కోట్ల రూపాయలు చొప్పున మొత్తం 9100 కోట్లు. వసతి దీవెన కింద మరో 3300 కోట్లు వెరసి 12400 కోట్లు బకాయిలు ఉన్నాయని ఆయన లెక్కలు వివరించారు. ప్రభుత్వం కేవలం 2900 కోట్లు మాత్రమే ఇచ్చిందని, మిగిలిన నిధుల కోసం శాసన మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర లేమి, పెట్టుబడి నష్టాలు, ఉచిత పంటల బీమా రద్దు వంటి అంశాలపై వైఎస్ఆర్‌సీపీ పోరాటం చేయాలని జగన్ చెప్పారు. నీటి విడుదల విషయంలో రైతులను మోసం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. అదే విధంగా,కొత్తగా ప్రవేశ పెట్టిన పీపీపీ పాలసీని ఆంధ్రప్రదేశ్ ఫర్ సేల్ అని ఆయన అభివర్ణించారు. ప్రభుత్వమే నిధులు ఇస్తూ, వడ్డీలు కడుతూ, రాయితీలు ఇస్తూ, చివరకు ప్రజల నుంచి యూజర్ ఛార్జీలు పేరుతో వసూలు చేసుకోవడానికి ప్రైవేటు సంస్థలకు అనుమతించడం పెద్ద స్కామ్ అని ఆయన అన్నారు.

**కేసులపై న్యాయపోరాటం**

రాష్ట్రంలో విపక్ష నేతలను అణచివేసేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీ నాయకులైన చింతాడ రవి, ముస్తాఫా, విరూపాక్షి, కారుమూరు సునీల్ వంటి వారిపై తప్పుడు సాక్ష్యాలు సృష్టించి అరెస్టు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శాంతియుత నిరసనలకు అవకాశం లేకుండా చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని దీనిపై కచ్చితంగా కోర్టులను ఆశ్రయిస్తామని వెల్లడించారు.

**శాసన మండలిలో డిప్యూటీ చైర్మన్ అభ్యర్థిగా మాధవరావు**

అసెంబ్లీకి దూరంగా ఉన్నా, మండలిలో తమకు ఉన్న బలాన్ని వాడుకుని ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని వైసీపీ నిర్ణయించింది. శాసనమండలి డిప్యూటీ చైర్మన పదవికి తూమాటి మాధవరావును వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా జగన్ ప్రతిపాదించారు. సభ్యులంతా సమన్వయంతో పని చేసి పూర్తి కసరత్తుతో సాక్ష్యాధారాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

# పార్లమెంట్‌లో చర్చకు లేవనెత్తుతాం

**మొదటి పేజీ తరువాయి...**

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్ లు కలసి కేంద్ర మంత్రులకు పంచదార్ల అక్రమ మైనింగ్ పై ఫిర్యాదు చేసారు. అనంతరం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ, శతాబ్దాల చరిత్ర కలిగిన ఉమా ధర్మలింగేశ్వర స్వామి ఆలయం, పవిత్రమైన ఐదు జలధారలకు మైనింగ్ కార్యకలాపాలతో ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. పంచదారల కొండను తక్షణమే 'నో మైనింగ్ జోన్'గా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

**అక్రమ మైనింగ్ పై పార్లమెంట్ లో లేవనెత్తుతాం - ఎంపీ గొల్ల బాబూరావు**

కూటమి ప్రభుత్వంలోని కొందరు పెద్దలు కుమ్మక్కై పంచదారలతో పాటుగా అనేక సహజ సిద్ధమైన వనురలను దోచుకుంటున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అడ్డగోలుగా తవ్వకాలు సాగిస్తూ బరితెగించి వ్యవహరిస్తున్నారు. అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇకపై దోపిడీని సాగనివ్వం. పంచదార్ల మాత్రమే కాదు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనేక ఆలయాల పరిధిలోను, కొండలను ధ్వంసం చేస్తూ కూటమి నేతలు వనరులను దోపిడీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్న కూటమి నేతలకు బుద్ధి చెప్పేలా మైనింగ్ అక్రమాలపై దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చేస్తాం. పురాతనమైన ఆలయాలను, కట్టడాలను, చారిత్రక సంపదను కాపాడాలన్న అధినేత జగన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలకుల అరాచకాలకు అడ్డుకట్ట వేస్తాం. ఈ అడ్డగోలు వ్యవహారం వైఎస్సార్ సీపీ తొలి నుంచి సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినా అధికార పార్టీ నేతల ఒత్తిడి కారణంగా ఎటుంటి చర్యలు తీసుకోలేదు. పంచదార్ల వంటి పవిత్ర పుణ్యక్షేత్రంపై ప్రభుత్వ ఉదాసీనతను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం.

**10 రోజుల్లో నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు - అరకు ఎంపీ తనూజా రాణి**

పంచదార్లలో జరుగుతున్న అక్రమ మైనింగ్ వెనుక సూత్రధారి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్. తన రాజకీయ అధికారంతో అనుచరుల పేరిట మైనింగ్ లీజులు తీసుకుని అక్రమ తవ్వకాలు చేస్తూ అడ్డగోలుగా దోపిడీ సాగిస్తున్నారు. మార్చి 2న మైనింగ్ ప్లాన్‌కు దరఖాస్తు చేయగా, నెల రోజుల్లోనే పర్యావరణ అనుమతులు వచ్చాయని, మేలో లీజ్ మంజూరైందని చెప్పారు. మైనింగ్ కార్యకలాపాలపై ఫిర్యాదులు, ఆందోళనలు కొనసాగుతున్న సమయంలో పంచదారల జలధారల్లో బురద నీరు రావడం ప్రారంభమైంది. ఈ వ్యవహారంపై గత ఏడాది స్థానికులు, సర్పంచ్ అక్రమ మైనింగ్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదు. అధికారుల సంయుక్త తనిఖీలో మైనింగ్ కార్యకలాపాలు, బ్లాస్టింగ్ వల్ల వచ్చే వైబ్రేషన్ల కారణంగా జలధారలపై ప్రభావం పడుతున్నట్లు గుర్తించారు. బురద నీరు రావడానికి మైనింగ్ కార్యకలాపాలే కారణమని ప్రాథమికంగా నిర్ధారించడంతో నిలిపివేత ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం జరిగిన విచారణలో అనుమతించిన మైనింగ్ ప్లాన్‌కు మించి సుమారు రెండు లక్షల టన్నుల గ్రావెల్ అక్రమంగా తవ్వినట్లు అధికారులు నివేదిక ఇచ్చారు. లీజుదారునిపై నిబంధనల ప్రకారం భారీ జరిమానా విధించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదు. సీఎం రమేశ్ అనకాపల్లిలో సాగిస్తున్న అడ్డగోలు వ్యవహారంపై కేంద్ర మైన్స్ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర పర్యాటక--సంస్కృతి, పురావస్తు శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి పంచదారల పరిస్థితిని వివరించాం. సమస్యపై కేంద్ర బృందాన్ని పంపించి పరిశీలన జరిపిస్తామని, 10 రోజుల్లో నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చారు.

**ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణ చేయాలి - మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్**

పంచదార్లలో మైనింగ్ ప్లాన్‌కు విరుద్ధంగా సుమారు రెండు లక్షల టన్నుల గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. అక్రమ మైనింగ్‌కు నిబంధనల ప్రకారం సుమారు రూ.250 కోట్ల జరిమానా విధించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఆ స్థాయిలో చర్యలు తీసుకోలేదు. మైనింగ్ వ్యవహారంపై అధికారుల సంయుక్త తనిఖీ అనంతరం స్టాపేజ్ ఆర్డర్ జారీ చేసినా ఖాతరు చేయలేదు. అక్రమ మైనింగ్‌కు సంబంధించి ఎంఆర్ఓ, వీఆర్ఓ, ఏడి మైన్స్ స్థాయి అధికారులను సస్పెండ్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదు అక్రమ తవ్వకాలపై ముందుగానే ఫిర్యాదులు అందిన నేపథ్యంలో బాధ్యత వహించాల్సిన ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాత్రపై దర్యాప్తు చేయాలి. కార్యాలయంలో పనిచేసే వ్యక్తి పేరుతో క్వారీ లీజ్ పొందారు. తవ్విన మట్టిని వివిధ ప్రాజెక్టుల ఫిల్లింగ్‌కు తరలిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, వాస్తవాలను వెలుగులోకి తేవాలి. అక్రమ మైనింగ్ కు బాధ్యత వహిస్తూ సీఎం రమేష్ రాజీనామా చేయాలి. ప్రభుత్వం జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి.

# అమరావతిలో కీలక ముందడుగు

**మొదటి పేజీ తరువాయి...**

ఈ రోడ్డును నిర్మించనుంది. ఫేజ్-2లో వెంకటపాలెం నుంచి ఉండవల్లి పాత జాతీయ రహదారి వరకు 3.92 కిలోమీటర్లకు ఈ రోడ్డును విస్తరించనుంది. ఫేజ్-2లో రెండు స్టీల్ బ్రిడ్జిల నిర్మాణాలను సర్కార్ పూర్తి చేయనుంది. ఫేజ్-3లో 3.50 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనుంది. ఉండవల్లిలో బకింగ్‌హామ్ కెనాల్‌పై 110 మీటర్ల స్టీల్ బ్రిడ్జిని ఏర్పాటు చేయనుంది. కొండవీటి వాగు, గుంటూరు ఛానల్‌పై 280 మీటర్ల స్టీల్ బ్రిడ్జిని ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంది. అమరావతి రహదారి అనుసంధానంలో సీడ్ యాక్సిస్ రోడ్డు కీలకంగా మారనుంది.

# గ్రామాల్లోనూ పరిశ్రమల స్థాపన

**మొదటి పేజీ తరువాయి...**

కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో చేపట్టాలని పిలుపునిచ్చారు.

**దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి**

పరిశ్రమల స్థాపనపై కొందరు రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీల నీరు మాత్రమే అవసరమవుతుందని, నీటి వినియోగంపై ఉన్న అపోహలను తొలగించాలని ఆదేశించారు. విశాఖపట్నంలోని పరిశ్రమలకు పోలవరం ఎడమ కాలువ నుంచి గ్రావిటీ ఫ్లో ద్వారా పుష్కలంగా నీటిని అందిస్తామని స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్ ప్రాజెక్టులు, హిందూపూర్ సమీపంలో ఏరోస్పేస్ ప్రాజెక్టుల ఏర్పాటును వేగవంతం చేయాలని తెలిపారు.రాయలసీమ ప్రాంతపు ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా రోడ్డు, రైలు మరియు పోర్టు కనెక్టివిటీని బలోపేతం చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలో నిర్మించే హోటళ్లు, పర్యాటక ప్రాజెక్టులు ప్రత్యేకమైన విశిష్ట నిర్మాణ శైలి కలిగి ఉండి పర్యాటకులను ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు.

# జస్టిస్ యశ్వంత్ వర్మ దోషే

**మొదటి పేజీ తరువాయి...**

సంభవించింది. మంటలను అదుపు చేయడానికి వచ్చిన అగ్నిమాపక సిబ్బందికి అక్కడి స్టోర్‌రూమ్‌లో కాలిన స్థితిలో ఉన్న భారీ మొత్తంలో ₹500 నోట్ల నగదు కనిపించింది. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించడంతో ఆయనపై పదవీ తొలగింపు (రిమూవల్) చర్యల కోసం లోక్‌సభ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపిన ముగ్గురు సభ్యుల కమిటీ తన నివేదికను మే నెలలోనే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించగా, బుధవారం ఈ నివేదికను పార్లమెంటు ముందుకు తీసుకొచ్చారు.

**కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలు:**

"న్యూఢిల్లీలోని 30 తుగ్లక్ క్రెసెంట్ నివాసంలోని స్టోర్‌రూమ్‌లో భారీగా లెక్క తేలని ₹500 నోట్ల నగదు లభ్యమైంది. ఆ నగదు మూలం, యాజమాన్యం లేదా దాని ఉనికిపై న్యాయమూర్తి సమర్పించిన వివరణలో నేర రహిత పారదర్శకత కానీ, సంస్థాగత బాధ్యత కానీ కనిపించలేదు. ఆయన నుంచి సంతృప్తికరమైన సమాధానం రాలేదు" అని లోక్‌సభ విచారణ కమిటీ నివేదిక తేల్చింది. చట్టబద్ధంగా ఆ ప్రాంతాన్ని సీల్ చేసి తనిఖీ చేయడానికి ముందే స్టోర్‌రూమ్‌లోని పరిస్థితులను చెరిపివేశారని, ఆ తర్వాత ఆ నగదు ఏమైందో ఇప్పటికీ స్పష్టత లేదని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. వివాదం బయటపడిన వెంటనే ఆయనను ఢిల్లీ హైకోర్టు నుంచి మాతృకోర్టు అయిన అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అనంతరం పార్లమెంటులో తొలగింపు ప్రక్రియ ప్రారంభం కావడంతో జస్టిస్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. జస్టిస్ వర్మ రాజీనామాతో ఆయనపై పార్లమెంటులో సాగుతున్న తొలగింపు ప్రక్రియ దాదాపు నిరర్థకమైంది. అయితే, ఆయన రాజీనామాను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఇంకా అధికారికంగా నోటిఫై చేయాల్సి ఉంది.

# నేడు కర్నూలుకు జగన్

**ఎమ్మెల్యే విరూపాక్షికి పరామర్శ**

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

గురువారం కర్నూలులో వైఎస్ఆర్‌సీపీ వైఎస్ జగన్ పర్యటించనున్నారు. జైలులో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి, 11 గంటలకు కర్నూలు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి పంచలింగాల వద్ద ఉన్న జిల్లా జైలుకు వెళ్లనున్నారు. జైలులో ఉన్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ములాఖత్‌లో కలిసి పరామర్శించి, ఆయనకు ధైర్యం చెప్పనున్నారు. అనంతరం మధ్యాహ్నం కర్నూలు నుంచి తిరిగిరానున్నారు.

# 20 వేల పేజీలతో చార్జిషీటు

**మొదటి పేజీ తరువాయి...**

20వేల పేజీలతో ఛార్జిషీట్ దాఖలు చేసింది. పబ్లిక్ ఎగ్జామినేషన్ చట్టం, 2024 కింద నిందితులపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అభియోగాలపై గురువారం నుంచి వాదనలు వింటామని న్యాయస్థానం తెలిపింది. 360 మంది సాక్షులు, 422 డాక్యుమెంట్లు, 43 భౌతిక సాక్ష్యాలను అభియోగపత్రంలో పొందుపర్చినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మీడియా ప్రచురిస్తున్న పేర్లలో కొందరు సాక్షులు మైనర్లు ఉండొచ్చని ఛార్జిషీటులోని కొన్ని భాగాలను పత్రికల్లో నిరంతరం ప్రచురిస్తున్నారని కోర్టుకు సీబీఐ తెలియజేసింది. అయితే, ఈ కేసులో సాక్షుల పేర్లను మీడియా ప్రచురించడంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టులో ఇంకా చెప్పనివి, ప్రస్తుతం ఛార్జిషీటులో భాగంగా ఉన్నవి మీడియాలో బహిర్గతం కావడం ఆశ్చర్యకరమని కోర్టు పేర్కొంది. బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి పనులు చేయకుండా ఉండాలని సూచించింది.

**పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు**

ఇదిలా ఉండగా, పేపర్ లీక్ వ్యవహారంపై ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. పరీక్ష పత్రాల లీకేజీని అరికట్టడానికి, అలాగే లీకేజీ బాధ్యులకు త్వరితగతిన శిక్ష పడేలా చూసేందుకు ఈ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కేసుల విచారణలో జాప్యం జరగకుండా, రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిపేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే, 2 నుంచి 3 నెలల లోపే కేసుకు సంబంధించిన తీర్పులు ఇచ్చేలా ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరీక్షల్లో అవకతవకలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు'కు కూడా ఇటీవల లోక్‌సభ ఆమోదం లభించింది. ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త సవరణలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఈ కేసులో దోషులుగా నిర్ధరణ అయితే, గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే, రూ.10కోట్ల వరకు భారీ జరిమానా విధిస్తారు.

**ప్రత్యేక టాస్క్‌ఫోర్స్**

ఇక, పేపర్ లీక్‌లను అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లాగే, ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కేంద్ర ప్రభుత్వం ఇదివరకే తెలిపింది. పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు మోదీ ప్రకటించారు. ఇందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, యువత సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కోసం ఏర్పాటు చేసిన కమిటీ, ప్రధానంగా పరీక్షల సంస్కరణలపై దృష్టి సారిస్తుంది. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ కమిటీలో నందన్ నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు అమృత్ లాల్ మీనా సభ్యులుగా ఉన్నారు.

# వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌కు నైతికబాధ్యత లేదా...!

**- ఛీ...అన్నా సిగ్గుండదా...!**

**-లోకేష్ పర్సనల్ ఇంటెలిజెన్స్ అంటూ బ్లాక్‌మెయిలింగ్**

**- ప్రణవ్‌ను తప్పించకపోతే కూటమికి చెడ్డ పేరే**

**- మీడియాతో జనసేన నేత మూర్తి యాదవ్**

**విశాఖపట్నం, ఆగస్టు 12, జయ జయహే :**




వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి బీజాలు వేయాల్సిన విశాఖ మెట్రో రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (వి.ఎం.ఆర్.డి.ఎ) అవినీతి కూపంగా మార్చిన చైర్మన్ ప్రణవ్ గోపాల్ తక్షణమే నైతిక బాధ్యత వహించే ఆ పదవి నుంచి తప్పుకోవాలని జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ మేఘాలయ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తీవ్రమైన అవినీతి అక్రమాల ఆరోపణలతో పోస్టింగ్ లేకుండా బదిలీ అయిన వి.ఎం.ఆర్.డి.ఏ కమిషనర్ తేజ్ భరత్ వ్యవహారాలు అన్నింటి లోనూ భాగస్వామి అయిన ప్రణవ్ గోపాల్ కూడా తక్షణమే ఆ పదవి నుంచి తప్పుకోవాలని లేనిపక్షంలో కూటమి ప్రభుత్వ పెద్దలు ఆయనను తప్పించి అవినీతి నుంచి వి.ఎం.ఆర్.డి.ఏ ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో కూటమి పరువును కాపాడాలంటే ,ప్రభుత్వం పారదర్శక పాలనను అందిస్తుందని జనం విశ్వాసం పొందాలంటే ప్రణవ్ గోపాల్ ను తప్పించడమే మార్గమని స్పష్టం చేశారు. అత్యంత నిజాయితీగా పనిచేసిన విశ్వనాథన్ బదిలీ చేయించడంలో కీలక పాత్ర పోషించిన ప్రణవ్ గోపాల్ ఆ తర్వాత వచ్చిన అవినీతి అధికారి తేజ భరత్ తో కుమ్మక్కై వి.ఎం.ఆర్.డి.ఏ కి తీరని నష్టం ,అత్యంత చెడ్డ పేరు తెచ్చి పెట్టారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,రాష్ట్ర పెట్టుబడుల శాఖ మంత్రి నారా లోకేష్ లు ఉత్తరాంధ్రకు ముఖ్యంగా విశాఖపట్నం లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో పలు పరిశ్రమలు తీసుకు వస్తున్న సమయంలో కీలకమైన పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గా అత్యంత అవినీతిపరుడు , చిత్తశుద్ధి ,నిబద్ధత వంటివి ఏమాత్రం లేని ప్రణవ్ గోపాల్ కొనసాగటం కూటమి ప్రభుత్వానికి మంచిది కాదని పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధికి కూటమి ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావాలంటే నిజాయితీపరులు విఎంఆర్డీఏ లో ఉండాలని అన్నారు. ప్రణవ్ గోపాల్ చైర్మన్ గా ఉన్న విఎంఆర్డిఏ అధికార బృందం భోగాపురం విమానాశ్రయానికి ఈరోజు వరకు రహదారుల నిర్మాణం పూర్తి చేయకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చిపెట్టిందన్నారు. భోగాపురం విమానాశ్రయానికి ఏడు మాస్టర్ ప్లాన్ రోహదారులను నిర్మిస్తున్నామని చెప్పిన విఎంఆర్డిఏ ఒక్క రోడ్డును కూడా పరిపూర్ణంగా ఈరోజుకి వేయలేకపోయిందని, భోగాపురం విమానాశ్రయం ముసుగులో ప్రైవేటు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనం కోసం గంభీరంలో రెండు రహదారులను ప్రారంభించి రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ విఎంఆర్డిఏ అభాసు పాలైందని పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన రహదారుల పనులు పూర్తి చేయాలంటే ఏడు రోడ్లు ఏడుగురు కాంట్రాక్టర్లకు ఇవ్వాలి. అందుకు విరుద్ధంగా ప్రణవ్ గోపాల్ బృందం కేవలం కమిషన్ల కోసం ఏడు రోడ్లను ఒకే కాంట్రాక్టర్కు కట్టబెట్టి నాసిరకం పనులతో ప్రభుత్వం పరువు తీశారని దుయ్యబట్టారు.



# భోగాపురంలో ప్రత్యేక విమానం ల్యాండింగ్

**న్యూఢిల్లీ నుంచి వచ్చిన గంటా, సీఎం రమేష్**

**విశాఖపట్నం, ఆగస్టు 12, జయ జయహే**

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకల సందడి మొదలైంది. వాస్తవానికి ఈనెల 17 వ తేదీ తర్వాత రెగ్యులర్ విమాన సర్వీస్ లు ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ ప్రకటించింది. అయితే ఆ సమయానికన్నా ముందే ప్రత్యేక విమానాల ల్యాండింగ్ మొదలైంది. ఢిల్లీ నుంచి భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ లు బుధవారం ప్రత్యేక విమానంలో భోగాపురం విమానాశ్రయంలో దిగగా.. మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు తదితరులు ప్రత్యేక విమానంలో వెళ్తూ కాకతాళీయంగా కలుసుకున్నారు. ఇక్కడ విమానాల టేక్ ఆఫ్ కు అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలను కల్పించారు. అలాగే విశాఖ నుంచి కనెక్టివిటీ కోసం మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఎలివేటెడ్ బీచ్ కారిడార్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఆర్టీసీ 16 ఎలక్ట్రికల్ బస్సులను భోగాపురం విమానాశ్రయం వరకు ఇప్పటికే ట్రయిల్ రన్ నడిపారు. మెట్రో కూడా సాధ్యమైనంత త్వరగా పట్టాలెక్కేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రత్యేక విమానాల రాకపోకలు మొదలవడంతో ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్ గా చెప్పుకునే భోగాపురం విమానాశ్రయం హడావిడి ప్రారంభమై సందడి షురూ అయ్యింది.



# ఘనంగా బొత్స అనూష జన్మదిన వేడుకలు

**విశాఖపట్నం, ఆగస్టు 12, జయ జయహే**

బీచ్ రోడ్‌లోని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బొత్స అనూష జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో విశాఖపట్నం జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్తలు తిప్పల శ్రీనివాస్, దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొని డాక్టర్ బొత్స అనూషకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బొత్స అనూష కి ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, విజయాలు ఎల్లప్పుడూ కలగాలని వారు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యురాలు బొత్స ఝాన్సీ, పార్టీ నాయకులు గొల్లగాని హరి వెంకట్ కుమారి, రవి రెడ్డి, జియ్యాని శ్రీధర్, బాణాల శ్రీనివాసరావు, పెడాడ రమణి కుమారి, కొండ రాజీవ్ గాంధీ, పళ్ళ దుర్గారావు, జీవి రామచంద్రరావు, స్వరూప్, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు భద్రత-ట్రాఫిక్‌పై ముందస్తు ప్రణాళిక



**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 12 :**

గోదావరి పుష్కరాలు-- 2027 సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టాల్సిన భద్రతా, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లపై ఎస్పీ డి. నరసింహ కిషోర్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో కలిసి రాజమహేంద్రవరం సమీపంలోని కొంతమూరు, కాతేరు ప్రాంతాల్లో పుష్కర్ నగర్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా షటిల్ బస్ స్టాప్‌లు, బస్సుల మార్గాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలు, పోలీసు బందోబస్తు, మౌలిక వసతులపై అధికారులు సమగ్రంగా సమీక్షించారు. అలాగే పుష్కరాల విధులకు వచ్చే పోలీసు సిబ్బందికి వసతి కల్పించే ప్రాంతాలను కూడా పరిశీలించి అవసరమైన ముందస్తు చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, ., జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్,, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీటీయూఏపీలో ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

**గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలు -- సీటీయూ వీసీ ప్రొ. టి.శ్రీనివాసన్**

**విజయనగరం, ఆగస్టు 12, (జయ జయహే)**





సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో డా. ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమానికి పాట్రన్ గా వ్యవహరించిన, ఇన్‌చార్జ్ ఉపకులపతి ప్రొ. తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాలు జ్ఞానాభివృద్ధికి, మేధో వికాసానికి, పరిశోధనకు కీలక కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. పుస్తక పఠనంతో పాటు ఆధునిక డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు నిరంతర అభ్యసనాన్ని అలవర్చుకుని తమ జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయ విద్యా ప్రమాణాల పెంపులో గ్రంథాలయాల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా తన సందేశంలో విద్యార్థుల విజయవంతమైన విద్యా, వృత్తి జీవితానికి గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, అకడమిక్ డేటాబేస్‌లు, డిజిటల్ వనరులను నిరంతరం వినియోగించడం ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవడంతో పాటు విశ్లేషణాత్మక ఆలోచనా శక్తి పెంపొందుతుందని తెలిపారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో గ్రంథాలయాన్ని ఒక ముఖ్యమైన భాగంగా చేసుకోవాలని సూచించారు. సీటీయూ గ్రంథపాలకులు డా. కొల్లె శంకర్ రెడ్డి జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. డా. ఎస్.ఆర్. రంగనాథన్ గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి చేసిన అపూర్వమైన సేవలను, భారతదేశంలో గ్రంథాలయ ఉద్యమానికి ఆయన అందించిన విశిష్ట దిశానిర్దేశాన్ని వివరించారు. ముఖ్య ప్రసంగకర్త ప్రొ. ముక్కామల శరత్‌చంద్ర బాబు 'శాస్త్రీయ పరిశోధన -- ఉపాధ్యాయుల జీవితం, వృత్తి ప్రగతిలో దాని ప్రాధాన్యత' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. నాణ్యమైన పరిశోధనకు గ్రంథాలయ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అధ్యాపకులు నిరంతరం తమ జ్ఞానాన్ని నవీకరించుకోవడంతో పాటు పరిశోధన ఆధారిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విశ్వవిద్యాలయ పరిశోధనా డాష్ బోర్డు ను వీసీ, రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్, లైబ్రేరియన్ లు ఆవిష్కరించారు. డా. దాసరి నారాయణ, సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమం లో డా. పరికిపండ్ల శ్రీదేవి, డా. అనిరుధ్ కుమార్, డా. సురేష్‌బాబు, డా. బొంతు కోటయ్య, డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, డా. దివ్య, డా. తారకేశ్వరరావు, డా. ప్రమాచటర్జీ, డా. గంగునాయుడు, డా. నాగేష్, డా. కుసుమ్, డా. వెంకటేశ్వర్లు డా. ప్రసాద్, డా. కిషోర్ తదితర అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.



# ఎస్కేఎంఎల్ ఆలయంలో వేరే విగ్రహమా...!

**- ఛైర్మన్ కందుల ఒంటెద్దు పోకడలు ఆపండి**

**- భక్తుల అభీష్టాన్నీ గౌరవించండి**

**- కార్య నిర్వాహణాధికారికి ఫిర్యాదు**

**- ఛైర్మన్ కందులపై యుద్ధం ప్రకటించిన స్థానికులు**

**విశాఖపట్నం , ఆగస్టు 12, జయ జయహే :**

విశాఖ వన్‌టౌన్ బురుజు పేట లోని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కందుల నాగరాజుపై దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు, స్థానికులు కొందరు యుద్ధం ప్రకటించారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి సుజాతని కలసి ఛైర్మన్ నాగరాజు తలపోస్తున్న పలు పనులను నిలువరించాలంటూ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఛైర్మన్ ఒంటెద్దు పోకడల కారణంగా ఆలయాన్ని భ్రష్టు పట్టించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఈ శక్తివంతమైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి గర్భాలయంలో అమ్మవారి విగ్రహాన్ని పోలిన వేరొక విగ్రహన్ని, అమ్మవారి వెనుక భాగంలో ఆలయ ప్రాంగణములో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించాలని ఛైర్మన్ నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు, ప్రపంచ ప్రఖ్యాత గాంచిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయములో ఉప ఆలయాలు నిర్మించుట అనేది., ఆగమ శాస్త్ర విరుద్ధమని, ప్రతి సంవత్సరము వినాయక చవితికి మట్టి వినాయకుని పెట్టి 5 రోజుల పాటు రెండు పూటలా పూజలు నిర్వహిస్తారని, ఇప్పుడు అందుకు విరుద్ధంగా దేవలయంలో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించాలని ప్రయత్నించడం సరికాదన్నారు. 1917 సంవత్సరంలో బ్రిటిష్ వారి పరిపాలన కాలంలో అమ్మవారి విగ్రహాన్ని తొలగించి బురుజుకొండ ప్రక్కన పడవేశారని, అప్పుడు విశాఖ నగరమంతా ప్లేగు వ్యాధి వచ్చిందని, అమ్మఅరి విగ్రహాన్ని యదాస్థితి (ప్రస్తుత) ప్రదేశములో తిరిగి ప్రతిష్టించిన తరువాతే యధాస్థితి వచ్చిందని గుర్తుచేశారు. ప్రతి సంవత్సరము శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాస మహోత్సవాలు ఆహ్వానపత్రిక లో దేవస్థానం ప్రచురిస్తుంది కూడా అని గుర్తుచేశారు. .శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి అఖండ భక్తుల మనోభావలను దృష్టిలో ఉంచుకొని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి గర్భాలయములో ఎటువంటి ఇతర దేవతల ఉప ఆలయాలు నిర్మించుకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికులు, పూర్వికులు, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఎటువంటి నిర్మణాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిందిగా విన్నవించారు. దశాబ్దాల చరిత్ర కలిగిస అమ్మవారు అప్పట్లో స్థానికులకు, భక్తులకు అమ్మవారు కలలో కనిపించి "నాకు గుళ్ళు, గోపురములు నిర్మించవద్దు...నేను ఎండలో ఎండి...వానలో తడిసి... నిత్యం పసుపు... కుంకమ...పాలు నారికేళ నీళ్ళు తో పూజలు, అభిషేకములు చేయాలని అమ్మవారు కోరుకున్నారన్నారు. అంతేగాక, జంతుబలి ఇక్కడ చేయరాదని అమ్మవారు కోరుకున్నారని పిర్యాదు పత్రం లో పేర్కొన్నారు . అమ్మవారి మార్గశిరమాసం, గురువారము ప్రీతి అయిన రోజులనీ, ఆనాటి నుంచి నేటి వరకు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి నిత్యం త్రికాల పూజలు, పసుపు కుంకమ,పాలు మరియు నారిరేళ నీళ్ళు అభిషేకములు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ప్రపంచం మొత్తం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మహత్యాన్ని, అమ్మవారి శక్తి మహిమలను తెలుసుకొని అమ్మవారి దీవెనల కోసం, మ్రొక్కుబడులు చెల్లించేందుకు భక్తులు తరలివస్తున్నారన్నారు. ఈ ఫిర్యాదు చేయడానికి స్థానికులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అయితే ఫిర్యాదులో మాత్రం 18 మంది సంతకాలు చేసినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి.



# సమర్ధవంతంగా ప్రజా పంపిణీ సేవలు

**విజిలెన్స్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి**

**విశాఖపట్నం, ఆగస్టు 12, జయ జయహే**

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నాణ్యమైన సరుకులు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, రేషన్ పంపిణీ, దీపం-2 పథకం, ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు, మీ మార్ట్ కార్యక్రమాల పురోగతిని ఆమె సమీక్షించారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులో ఎటువంటి లోపాలకు తావు లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. దీపం-2 పథకం అమలులో అర్హులైన లబ్ధిదారులందరికీ సబ్సిడీ ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని, ఎల్పీజీ కనెక్షన్లకు సంబంధించిన సేవలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలని ఆమె పేర్కొన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ కింద రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాల పనితీరును సమీక్షించిన ఇంచార్జి కలెక్టర్, నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు వినియోగదారులకు అందించేందుకు చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా బహిరంగ మార్కెట్లో ధరల నియంత్రణకు తోడ్పాటు అందించాలన్నారు. అలాగే జిల్లాలో 75 ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో అమలు చేస్తున్న "మీ మార్ట్" కార్యక్రమాన్ని మరింత విస్తరించి, రేషన్ కార్డు దారులకు అవసరమైన నిత్యావసర వస్తువులు ఒకేచోట లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఫెయిర్ ప్రైస్ దుకాణాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్వో భాస్కరరావు, ఏఎస్వో కళ్యాణి, సివిల్ సప్లైస్ డీఎం సృజన, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె. రామారావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేశ్, లీగల్ మెట్రాలజీ ఏసీ రాధాకృష్ణ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, పలువురు డీలర్లు, చెకింగ్ ఇన్సపెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మాడుగులలో హర్ ఘర్ తిరంగా.. ర్యాలీ

**మాడుగుల ఆగస్టు 12 జయ జయహే**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం మాడుగుల పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పి లక్ష్మీ నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ సన్యాసిరావు, కార్యదర్శి పి రమేష్,క్లస్టర్ ఇంచార్జీ వడ్డి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు




## ఆలయాలకు నిధులు మంజూరుపట్ల ఎమ్మెల్యేకి ధన్యవాదాలు

**మాడుగుల,ఆగస్టు 12, జయ జయ హే**

మాడుగుల గ్రామంలో రెండు ఆలయాలకు బండారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక కృషితో నిధులు మంజూరు చేయడం పట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ లక్ష్మీనారాయణ ధన్యవాదాలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మాడుగుల గ్రామంలోశ్రీ గంగాదేవి గుడి నిర్మాణానికి 20 లక్షలు,అలాగే శ్రీ పోతురాజు బాబు గుడి నిర్మాణానికి 40 లక్షలు, మొత్తంగా 60 లక్షల రూపాయలు మంజూరు కావడం ఎంతో సంతోషకరమన్నారు. మాడుగుల గ్రామ అభివృద్ధి, దేవాలయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, సంపూర్ణంగా సహకరిస్తున్న శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి కి మాడుగుల గ్రామ ప్రజలందరి తరఫున ధన్యవాదాలు తెలిపారు. మాడుగుల అభివృద్ధి కోసం మీ సేవలు మరింత కొనసాగాలని ఎమ్మెల్యేని కోరారు.

# హసీనా పునరాగమనంతో భారత్ బంగ్లాలకు పరీక్ష

(ప్రతాప్)



బంగ్లాదేశ్ రాజకీయాల్లో మాజీ ప్రధాని షేక్ హసీనా పునరాగమన ప్రకటన మరోసారి తీవ్ర చర్చకు తెరలేపింది. 2024 ఆగస్టులో ప్రజా ఉద్యమం నేపథ్యంలో అధికారం కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందిన హసీనా, 2026 డిసెంబరులో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయపరమైన పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఆమెపై బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ గైర్హాజరీలో మానవత్వానికి వ్యతిరేకమైన నేరాల కేసులో మరణశిక్ష విధించింది. అయితే ఈ తీర్పును హసీనా రాజకీయ ప్రేరేపితమైనదిగా అభివర్ణిస్తున్నారు.

హసీనా పునరాగమనం ఒక మాజీ ప్రధాని స్వదేశానికి తిరిగి రావడం మాత్రమే కాదు; బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య పరిణతి, న్యాయవ్యవస్థ విశ్వసనీయత, రాజకీయ సహనం, పౌర హక్కుల పరిరక్షణకు కీలక పరీక్ష. 2026 ఫిబ్రవరి ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించి తారిఖ్ రెహ్మాన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధానికి గురైన నేపథ్యంలో, ఆమె పునరాగమన ప్రకటన దేశ రాజకీయాలను మరింత ఉద్రిక్తం చేసే అవకాశముంది.

హసీనా స్వదేశానికి తిరిగి వస్తే న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆమె అనుచరుల్లో రాజకీయ చైతన్యం పెరిగి, అవామీ లీగ్ పునరుద్ధరణకు డిమాండ్లు ఊపందుకునే అవకాశం ఉంది. ఫలితంగా నిరసనలు, ప్రతినిరసనలు ముదిరితే సామాజిక ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అందుకే ఈ పరిణామాన్ని రాజకీయ ప్రతీకారానికి వేదికగా కాకుండా చట్టబద్ధ ప్రక్రియకు లోబడి పరిష్కరించాల్సిన అంశంగా చూడాలి. ఆరోపణలు ఎంత తీవ్రమైనవైనా, న్యాయ విచారణ పారదర్శకంగా, విశ్వసనీయంగా సాగడం అత్యవసరం. అదే సమయంలో పౌర హక్కులు, రాజకీయ అభిప్రాయ స్వేచ్ఛ, న్యాయపాలనకు విఘాతం కలగకుండా చూడాలి.

ఈ పరిణామం భారత్‌కు కూడా అత్యంత సున్నితమైన దౌత్య పరీక్ష. హసీనా భారత్‌లో ఉండటం ఇప్పటికే ఢాకా-న్యూఢిల్లీ సంబంధాలను సంక్లిష్టం చేసింది. ఆమెను అప్పగించాలని బంగ్లాదేశ్ కోరుతున్న నేపథ్యంలో, భారత్ చట్టపరమైన బాధ్యతలు, ద్వైపాక్షిక సంబంధాలు, మానవతా అంశాలు, ప్రాంతీయ ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించాల్సి ఉంది. ఇటీవల హసీనా ఢిల్లీలో చేసిన ప్రకటనపై ఢాకా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం ఈ సున్నితత్వాన్ని మరింత స్పష్టం చేసింది.

భారత్‌కు బంగ్లాదేశ్ కేవలం పొరుగు దేశం కాదు; తూర్పు సరిహద్దు భద్రత, వాణిజ్యం, ఈశాన్య రాష్ట్రాల అనుసంధానం, అక్రమ రవాణా నిరోధం, నదీజలాల నిర్వహణ, ఇంధన సహకారం వంటి అనేక రంగాల్లో కీలక భాగస్వామి. రోహింగ్యా శరణార్థుల సంక్షోభం, మయన్మార్‌లో అస్థిరత, వాతావరణ మార్పుల ప్రభావాలు కూడా రెండు దేశాల సహకారాన్ని కోరుతున్న ఉమ్మడి సవాళ్లు.

అందువల్ల హసీనా వ్యవహారంలో భారత్ ఏ ఒక్క రాజకీయ వర్గానికి అనుకూలంగా కనిపించకుండా, చట్టపాలన, మానవ హక్కులు, ద్వైపాక్షిక ప్రయోజనాలు, ప్రాంతీయ స్థిరత్వం అనే నాలుగు అంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. బంగ్లాదేశ్ కూడా ప్రతీకార రాజకీయాలకు దూరంగా, ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయాలి.

హసీనా తిరిగి వస్తారా? వస్తే రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయి? అన్నదానికంటే ముఖ్యమైన ప్రశ్న---ఆమె పునరాగమనం బంగ్లాదేశ్‌ను మరింత ప్రజాస్వామ్యబద్ధమైన, స్థిరమైన, సమగ్ర దేశంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందా? అన్నదే. ఈ పరిణామం ఢాకా రాజకీయాలకే పరిమితం కాదు. దాని ప్రభావం భారత్‌తో సంబంధాలు, దక్షిణాసియా భద్రత, వాణిజ్యం, వలసలు, రోహింగ్యా సంక్షోభం, వాతావరణ సహకారం వరకు విస్తరించవచ్చు. అందుకే హసీనా పునరాగమనం బంగ్లాదేశ్‌కే కాదు---భారత్ సహా మొత్తం దక్షిణాసియాకు ఒక కీలక పరీక్ష.

ళి5:48 జూఎ, 12/8/2026ి జీుఘుష్ట్రవ ాబతీవంష్ట్ర ాఱతీ: భక్తుల పాలిటి కొంగు బంగారం కొళాపూర్ మహాలక్ష్మి

(సి. హెచ్.ప్రతాప్)

మహారాష్ట్రలోని కొల్హాపూర్ నగరం ఆధ్యాత్మికత, చరిత్ర, కళావైభవాల సమ్మేళనంగా ప్రసిద్ధి చెందింది. ఈ నగర హృదయంలో కొలువుదీరిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, భక్తులు ప్రేమగా అంబాబాయి ఆలయంగా పిలుచుకునే ఈ క్షేత్రం, దేశంలోని ప్రముఖ శక్తి ఆరాధనా కేంద్రాల్లో ఒకటి. ప్రాచీన చాళుక్య సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ ఆలయం శతాబ్దాలుగా భక్తి, శిల్పకళ, పురాణ విశ్వాసాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. మహారాష్ట్ర పర్యాటక శాఖ ప్రకారం ఆలయ నిర్మాణం 7వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తారు.

కొల్హాపూర్ మహాలక్ష్మి క్షేత్రానికి పురాణపరమైన విశిష్టత ఎంతో ఉంది. స్థానిక విశ్వాసాల ప్రకారం కొల్హాపూర్‌లో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే మూడు శక్తి స్వరూపాలు కొలువుదీరినట్లు చెబుతారు. మహాలక్ష్మి అమ్మవారిని సంపద, శ్రేయస్సు, ఐశ్వర్యానికి ప్రతీకగా ఆరాధిస్తారు. కొల్హాసురుడు అనే రాక్షసుడిని అమ్మవారు సంహరించిన అనంతరం ఈ ప్రాంతం ఆమెకు ప్రీతిపాత్రమైన క్షేత్రంగా మారిందనే పురాణగాథ కూడా ప్రాచుర్యంలో ఉంది. అందుకే అమ్మవారిని స్థానికులు ఆప్యాయంగా 'అంబాబాయి'గా పిలుస్తారు.

ఆలయ నిర్మాణంలో చాళుక్య, హేమాద్పంతి శైలుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. నల్లరాతితో నిర్మించిన గర్భగుడి, శిల్పాలతో అలంకరించిన స్తంభాలు, ద్వారాలు, శిఖర నిర్మాణం నాటి శిల్పుల నైపుణ్యాన్ని చాటుతాయి. గర్భగుడిలో నల్లరాతితో రూపొందించిన మహాలక్ష్మి విగ్రహం భక్తుల ప్రధాన ఆకర్షణ. ఆభరణాలు, పుష్పాలు, వస్త్రాలతో అలంకరించిన అమ్మవారి రూపం ఆలయంలోని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత గంభీరంగా మారుస్తుంది. ఆలయ ప్రాంగణంలో విష్ణువు, శివుడు, గణపతి తదితర దేవతలకు సంబంధించిన ఉపాలయాలు కూడా ఉన్నాయి.

ఈ క్షేత్రంలోని అత్యంత ఆసక్తికరమైన విశేషాల్లో కిరణోత్సవం ఒకటి. సంవత్సరంలో నిర్దిష్ట రోజులలో సూర్యకిరణాలు ఆలయ నిర్మాణంలోని ప్రత్యేక అమరికల ద్వారా గర్భగుడిలోని అమ్మవారి విగ్రహంపై పడే విధంగా ఆలయ నిర్మాణం ఉండటం భక్తులను, చరిత్ర-వాస్తు పరిశోధకులను ఆకట్టుకుంటుంది. ఈ ఘటనను భక్తులు అమ్మవారిని సూర్యభగవానుడు స్వయంగా దర్శించుకునే పవిత్ర సందర్భంగా భావిస్తారు. ఆలయ నిర్మాణంలో ఖగోళ పరిశీలనకు సంబంధించిన ప్రాచీన జ్ఞానం కూడా ఉండి ఉ ండవచ్చనే ఆసక్తిని ఇది కలిగిస్తుంది.

నవరాత్రులు, దీపావళి వంటి పర్వదినాల్లో ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. నవరాత్రి సమయంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. 2025 నవరాత్రుల తొలిరోజే లక్షకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు స్థానికంగా నమోదైంది.

ఈ ఆలయం కేవలం పూజా స్థలం మాత్రమే కాదు; కొల్హాపూర్ సాంస్కృతిక జీవనానికి కూడా కేంద్రబిందువు. భక్తి, శిల్పకళ, చరిత్ర, స్థానిక సంప్రదాయాలు ఇక్కడ ఒకే చోట కలుస్తాయి. పంచగంగ ప్రాంతపు ఆధ్యాత్మిక వాతావరణం, నగరంలోని ఇతర చారిత్రక ప్రదేశాలతో కలిపి కొల్హాపూర్‌ను ప్రముఖ పుణ్యక్షేత్రంగా నిలబెడుతున్నాయి.

సంపద అంటే కేవలం ధనం కాదని, జీవితం సుసంపన్నంగా ఉండేందుకు అవసరమైన శాంతి, సంతృప్తి, ధైర్యం, శ్రేయస్సు కూడా సంపదేనని మహాలక్ష్మి ఆరాధన తెలియజేస్తుంది. శతాబ్దాల చరిత్రను మోస్తూ, నేటికీ కోట్లాది భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్న కొల్హాపూర్ అంబాబాయి క్షేత్రం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయ వైభవానికి చిరస్థాయిగా నిలిచే ప్రతీక..

# "ఆలోచనలకు ఆకారమే జీవన సాకారం"

మనిషికి బయట కనిపించే జీవితానికి ముందు,అతని మనసులో ఒక జీవితం ఇప్పటికే నిర్మితమై ఉంటుంది.
ఆ నిర్మాణానికి పునాది అతని ఆలోచన.
మనిషి జీవితంలో ఆలోచనలనేవి ఒక ప్రవాహం.
ఆ ప్రవాహం మానసిక శాస్త్ర సూత్రానుసారం జరిగితే !
అదే ! కార్య ప్రవాహంగా సత్ఫలితాల సమూహంగా మారుతుంది.

ఆలోచనలో మార్పు
మనిషి దృక్పథంలో మార్పు
తీసుకువస్తుంది.
మనిషి దృక్పథంలో మార్పు
అంత: ప్రవర్తనలో మార్పు తీసుకొస్తుంది.
అంత: ప్రవర్తనలో మార్పు బాహ్య ప్రవర్తనగా ప్రదర్శింపబడుతుంది.

ప్రవర్తనావళిలో పరిపక్వత కలిగినప్పుడు.

నేను ఏమవ్వాలనుకుంటున్నాను ?
ఏమి సాధించాలనుకుంటున్నాను?
ఎలా జీవించాలనుకుంటున్నాను ?
నాలో గల శక్తి సామర్థ్యములు ఏంటి ?

వంటి ప్రశ్నలకు మన అంతరంగం తలెత్తుతాయి వాటి సమాధానాలే రేపటి మన జీవితానికి శంకుస్థాపన.

1. ప్రతి సృష్టికి ముందు ఒక ఆలోచన :

ఇల్లు కట్టే ముందు దాని నమూనా మనసులో ఉంటుంది.
పుస్తకం రాసే ముందు దాని భావం రచయితలో ఉంటుంది.
సంస్థ పుట్టే ముందు దాని ఆలోచన ఒక మెదడులో మొలకెత్తుతుంది.

సృష్టి బయట మొదలవదు. ముందు మనసులో మొదలవుతుంది.
ఆలోచన = విత్తనం.
ఆచరణ = నీరు.
క్రమశిక్షణ = ఎరువు.
సహనం = కంచె.
విజయం = ఫలం.

2. కలలు కనడం తప్పు కాదు:
"కల వల్ల లాభమేమిటి?" అని అడిగేవారు చాలా మంది.
కానీ కల లేకుండా గొప్ప జీవితం కట్టడం అసాధ్యం.
కల అంటే నిద్రలో కనేది మాత్రమే కాదు. నిద్ర పట్టనివ్వని లక్ష్యమే అసలైన కల.

కల → లక్ష్యం → ప్రణాళిక → ఆచరణ → పట్టుదల → సాఫల్యం
ఈ మెట్లు ఎక్కినప్పుడే కల, నిజంగా సాకారం అవుతుంది.

3. ఆలోచనలకు ఆకారం ఇవ్వాలి:

"ఒక రోజు గొప్పవాడిని అవుతాను" --- ఇది ఆలోచన.
"దానికోసం ఈరోజు నేను ఏమి చేయాలి?" ఇది తొలి అడుగు.

ఆలోచనకు సమయం ఇవ్వాలి. దిశ కల్పించాలి. ప్రణాళిక ఏర్పాటు చేయాలి. క్రమశిక్షణను జోడించాలి. పెద్దల ఆలోచనలతో సమాలోచన కూడా చేయాలి.
అప్పుడే అది జీవితాన్ని మార్చే శక్తిగా మారుతుంది.

4. ఆలోచనలే వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి.

మనం ఎక్కువగా దేని గురించి ఆలోచిస్తామో, అదే మన దృక్పథం అవుతుంది.
దృక్పథం → ప్రవర్తన → అలవాటు → వ్యక్తిత్వం → జీవిత గమనం.

అందుకే ప్రతి ఆలోచనను నమ్మనవసరం లేదు.కానీ ప్రతి ఆలోచనను పరిశీలించాలి.
పరిశీలించిన ఆలోచనలలో సరైనదాన్ని ఎంచుకోవాలి.
అనవసరం అయిన వాటిని నివారించుకోవాలి.
నియంత్రించుకోవాలి.
నిర్మూలించుకోవాలి.
అనవసరపు ఆలోచనలను నియంత్రించాలన్నా!
నిర్మూలించాలన్నా!
నివారించాలన్న !
మానసిక శాస్త్ర ప్రకారం
ఏకైక మార్గం...
కార్యక్రమాలలో ఉపక్రమించటం.
నిమగ్నం అవ్వటం.
కార్యరూపాలు దాల్చటం.

5. ప్రతికూల ఆలోచనలు కనిపించని గోడలు :

మనల్ని బయటి ప్రపంచం అంతగా ఆపదు. మన "నేను చేయలేను", "ఇది అసాధ్యం" అనే మాటలే ఆపుతాయి.
గుర్తుంచు పోవలసినది:
ప్రతి భయం ప్రమాదం కాదు. ప్రతి వైఫల్యం ముగింపు కాదు.
భయానికి భయం పుట్టాలి అంటే..
మనిషి మనసులో ఆలోచనలు కార్యరూపాలు దాల్చాలి. భయాల్ని బలాలుగా మార్చాలి.

6. కలకు కాళ్లు --- కృషి:

కలకు కళ్లు ఉంటాయి కళ్ళు కాళ్లు ఉండవు. వాటికి కాళ్లు ఇచ్చేది కృషి.

ప్రతిభ ం కృషి లేకపోతే అది సామర్థ్యంగానే మిగులుతుంది.
జ్ఞానం ం ఆచరణ లేకపోతే అది సమాచారంగానే మిగులుతుంది.
కసి కృషి పట్టుదల నిరంతరత... సాఫల్యతకు గొప్ప ఆయుధాలు.

కలలు దిశను చూపుతాయి. కృషి గమ్యానికి చేరుస్తుంది.

7. వైఫల్యం కూడా ఒక రూపకల్పనే :

ప్రతి అడుగు విజయం కానవసరం లేదు. కొన్ని వైఫల్యాలు మన తప్పులను, కొన్ని మన బలహీనతలను, కొన్ని మార్గ మార్పును సూచిస్తాయి.
వైఫల్యం తీర్పు కాదు, అది ఒక సమాచారం. దాన్ని చదివి ముందుకు సాగితే, అదే రేపటి విజయానికి పునాది.

"విజయాన్ని ఒడిసి పట్టుకోవడమే కాకుండా ! అపజయాన్ని అంగీకరించి ఓర్చుకోవటం కూడా నేర్వాలి"

8. జీవితానికి లక్ష్యం అవసరం .

గమ్యం లేని ప్రయాణం ఎంత సుదీర్ఘమైనా వ్యర్థం.
గమ్యం ఉన్న ప్రయాణం ప్రతి అడుగుకూ అర్థాన్ని ఇస్తుంది.

" ఈ లక్ష్యం లేని మనిషి జీవితం ఎండుటాకు వంటిది అని అంటారు పెద్దలు"

9. ఆలోచన → ఆచరణ → అలవాటు → వ్యక్తిత్వం → జీవితం

జీవితాన్ని మార్చాలంటే ముందు పరిస్థితులు కాదు, ఆలోచనా విధానాన్ని మార్చాలి.

10. నీ కలకు నీవే శిల్పి :

ఇతరులు సలహా ఇవ్వగలరు, మనకు తోడు నిలవ గలరు. కానీ మన ఆలోచనలకు ఆకారం ఇవ్వాల్సింది, మన కలలకు ప్రాణం పోయాల్సింది, మన అడుగులకు దిశ చూపాల్సింది మనమే.
కలలు కనాలి.
కనే కలలను ఆలోచనలగా మార్చాలి.
చేసే ఆలోచనలను పరిశీలించాలి.
పరిశీలించే ఆలోచనలను
ఆచరించాలి.
ఆచరించిన ఆలోచనలే
కార్యరూపాలై కలలను సహకారం చేస్తాయి.
సాఫల్యతను చేకూర్చుతాయి.
ఇదంతా ఓ మానసిక శాస్త్ర శాస్త్రీయ ప్రక్రియ.

ఆలోచనలకు ఆకారము ఇవ్వడం అంటే ! కార్యాలయం జోడించటం కార్యక్రమాలను నిర్వహించటం. క్రమశిక్షణతో రూపకల్పన చేయటం.

ఈ క్రమంలో చేసే పనులు వైఫల్యలు అయితే ! వాటిని వ్యతిరేక ఆలోచనలతో నిరాశ చెందవలసినటువంటి అవసరంలేదు.
వైఫల్యం అంటే ? సాఫల్యానికి వ్యతిరేకపదంగా భావించిన అవసరం లేదు.

అదో మెరుగైన పద్ధతులను నేర్చుకునే అవకాశం. చివరకు మన కలలను మన జీవిత సత్యాలుగా మార్చు కోగలిగే ఓ ప్రక్రియ మాత్రమే.

ఎందుకంటే,
"ఆలోచనలకు ఆకారమే మనిషి జీవితం.
మనిషి జీవిత సాకారమే కలల సార్థక్యం "



**డా. జి. రాజేశ్వరరావు**
**ఫ్యాకల్టీ అఫ్ సైకాలజీ , ఆంధ్ర యూనివర్సిటీ**

# నేరాలకు అడ్డాగా రాజమహేంద్రవరం?

**రాజమహేంద్రవరం, జయ జయహే**



ఆగస్టు 12:రాజమహేంద్రవరం నగరంలో వరుసగా చోటుచేసుకుంటున్న హత్యలు, దాడులు, ప్రమాదాలపై మాజీ ఎంపి , వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.గత 15 రోజుల్లో మూడు హత్యలు చోటుచేసుకున్నాయని, మెడికో విద్యార్థిని ప్రియాంక రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, రెండు చోట్ల బ్లేడ్ దాడులు జరిగాయని ఆయన తెలిపారు.ఇన్నీసుపేట పోలమాంబ జాతరలో యర్రా గణేష్ అలియాస్ గంజి హత్య, గోరక్షణపేటలో చెవ్వేటి బుజ్జి హత్య, క్వారీ మార్కెట్ సెంటర్‌లో మార్తి నూకరాజుపై బ్లేడ్ దాడి, కాతేరు వద్ద యువతి హత్య వంటి ఘటనలను ప్రస్తావించారు.నగరంలో మద్యం, గంజాయి మత్తులో నేరాలు పెరుగుతున్నప్పటికీ పోలీసులు సమర్థవంతంగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నేరగాళ్లు రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్నారని, ప్రజాప్రతినిధులు కూడా ఈ అంశంపై స్పందించడం లేదని ఆరోపించారు. ప్రశాంతమైన రాజమహేంద్రవరం నేరాలకు కేంద్రంగా మారడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్న ఆయన, పోలీసులు కఠిన చర్యలు తీసుకొని శాంతిభద్రతలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గంజాయి, మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, యువతను నేరాల బాట పట్టిస్తున్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.–

## 2 నెలలుగా ఆదివాసి విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు నిలిపివేత..

### ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు..

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఆగస్టు 13,**



అల్లూరి జిల్లా లోని కొయ్యూరు, చింతపల్లి, జీ.కే.వీధి, జీ.మాడుగుల, పాడేరు, హుకుంపేట, అరకు వ్యాలీ, అనంతగిరి, డుంబ్రిగూడ తో కలిపి 10 మండలాల్లో ఆదివాసి విద్యార్థుల కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు రెండు నెలలుగా నిలిచిపోయింది. తండ్రి పేరులో కరెక్షన్ ఉందని చెప్పి 6వ తరగతి నుండి ఇంటర్ 1వ సంవత్సరం వరకు చదువుతున్న మొత్తం 1670 మంది విద్యార్థుల కుల ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. క్లాసులు ప్రారంభమైపోయాయి. మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు కాబట్టి పర్వాలేదు. కానీ ప్రైవేట్ స్కూళ్లలో చదివితే పరిస్థితి ఏమిటి అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులను అడిగితే పాడేరు సబ్ కలెక్టర్ గారి లాగిన్ లో ఉన్నాయి. అవి సరిచేయాల్సిన బాధ్యత వారిదే అని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. జూన్, జులై నెలల్లో విద్యార్థులు పాఠశాలల్లో జాయిన్ అయ్యే సమయం. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు తల్లిదండ్రుల పేర్లు రిజిస్టర్ లో ఎంటర్ చేసే ఉంటారు. మధ్యలో ఎలా తప్పులు వస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై కొయ్యూరు మండల ఆదివాసి జేఏసీ మండల అధ్యక్షులు ఎస్. అశోక్ లాల్ స్పందిస్తూ, విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆందోళన కలిగించవద్దని కోరారు.




## మోసాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందితుడు అరెస్ట్

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ సమీపంలో గల మాణిక్య లాడ్జి కింద గల ఎస్బిఐ ఏటిఎం లో కొత్తూరు.ఎన్జీవోస్ కాలనీకి చెందిన జీవీఎంసీ ఉద్యోగి ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తి ఈనెల నాలుగో తేదీన ఏటీఎం నుండి డబ్బులు తీస్తూ ఉండగా పలు కేసుల్లో నిందితుడు గా ఉన్న రాజేష్ నారాయణమూర్తి సహాయం చేస్తానని నమ్మబలికి మోసపూరితంగా ఏటీఎం పిన్ను వివరాలను సేకరించి అతని ఖాతా నుండి 10000 నగదు విత్డ్రా చేసుకుని అక్కడ నుండి పరారయ్యాడు బాధితుడు నారాయణమూర్తి వెంటనే తేరుకుని పట్టణ పోలీసులు ఫిర్యాదు ఇవ్వడం జరిగింది . కేసు నమోదు చేసిన పోలీసులు అక్కడ ఏటీఎంలో ఉన్న సి సి టీవీ మరియు పట్టణంలో గల సీసీటీవీ కెమెరాల ద్వారా నిందితున్ని గుర్తించడం జరిగింది. కేసు దర్యాప్తులో ఉన్న పోలీసులకు బుధవారం మధ్యాహ్నం నిందితుడు తాలూకా పక్క సమాచారం అందడంతో స్థానిక పోలీసులు రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రోడ్ లో సంచరిస్తున్న నిందితుడు పత్తి రాజేష్ ను (29) ఎస్సై ఏ వెంకటేశ్వర్లు మరియు వారి సిబ్బంది అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 10000 రూపాయల నగదును స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇతను స్వస్థలం కాకినాడ జిల్లా సామర్లకోట మండలం అయోధ్య రామపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించడం జరిగింది ఇతను 12 కేసులు ఉన్నట్లుగా అంతర్ జిల్లా నేరస్థుడిగా పోలీసుల పేర్కొన్నారు ఈ మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



## జ్ఞానాపురంలో డెంగీ

### దోమల లార్వాపై మలేరియా అధికారుల అవగాహన

**విశాఖపట్నం, ఆగష్టు 12, జయ జయహే :**

సౌత్ జోన్ 41 వార్డ్ జ్ఞానపురం ఏరియాలో 8 ఏళ్ళ అబ్బాయికి డెంగ్యూ ఫీవర్ నమోదు అయిన కారణంగా జిల్లా మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డి, సహాయ మలేరియా అధికారి బి.నాగభూషణరావుల బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాధితుడ్ని పరామర్శించి ఆరోగ్య స్థితిని వాకబు చేశారు. చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని గుర్తించి అదే ఇంట్లో లార్వా కోసం తనిఖీలు చేపట్టారు. ఆ ఇంటి నిండా ఉన్న నీటి కుండీల్లో లార్వా గమనించి నిర్మూలించారు. ఆ పరిసర ప్రాంతంలో ఒక ఇంట్లో ఫ్రిజ్ వెనుక తొట్టి లో లార్వా గమనించి నిర్మూలించారు. ప్రజలు అందరకీ కీటక జనిత వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించి లైవ్ లో లార్వా ని చూపించి అవగాహన కల్పించారు. జీవీఎంసీ సిబ్బంది, మలేరియా సిబ్బంది స్ప్రే ఆపరేషన్లు క్వాలిటీ గా చేయాలని స్ప్రయింగ్ వెంటనె నిర్వహించాలని అదికారులు ఆదేశించారు. ఆయా పరిసర ప్రాంతాల్లో 200 ఇళ్ళ ను సందర్శించి ఫీవర్ సర్వే చేసి జ్వర పీడితులు, అనుమానితులు గుర్తిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




## జనగణన సిబ్బందికి సర్వేలో శిక్షణ

**అనకాపల్లి జయ జయహే**

జనగణ 2027 లో భాగంగా సెన్సెస్ హ్యాండ్ బుక్ విలేజ్ డైరెక్టరీ వివరాల సేకరణ నమోదు ఝుఎబ క్షేత్రస్థాయిలో పనిచేసే ఆఫీసర్ కి అనకాపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు కేంద్ర జనగణ కమిటీ (ఓఆర్ జిఐ ) జాయింట్ డైరెక్టర్ ఎం కె తివారి ఈ సభకు హాజరై ఆయన మాట్లాడుతూ 2025 డిసెంబర్ 31న ప్రామాణిక తేదీగా తీసుకొని వివరాలు సేకరించాలని శిక్షణా సిబ్బందికి సూచించడం జరిగింది జనవాసం ఉన్న మరియు లేని గ్రామాలతో పాటు కొత్తగా ఏర్పడిన విలీనమైన గ్రామాలు అవుట్ గ్రోత్ ప్రాంతాల వివరాలను నమోదు చేయాలని ప్రతి పేజీని సంబంధిత అధికారి సంతకంతో ధ్రువీకరించాలని వారి పేర్కొన్నారు అనకాపల్లి మండల వీఆర్వోలు కు మరియు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ కు శిక్షణ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కౌశిక్, ఏపీ డి సి ఓ అసిస్టెంట్ డైరెక్టర్ కె స్వప్నిల్, అడిషనల్ కమిషనర్, జీవీఎంసీ, డిస్ట్రిక్ట్ రెవిన్యూ ఆఫీసర్ సత్యనారాయణ, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ షేక్ అయేషా,ఎంపీడీవో ఆశాజ్యోతి,ఏ ఎస్ ఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామ సభ ఆమోదం లేకుంటే పనులు అడ్డుకుంటాం

## గ్రామస్తులతో మాన్విద్కర్ సామాజిక మంచ్ సంస్థ సమావేశం

**పాయకరావు పేట, ఆగష్టు 12, జయ జయహే :**




గ్రామ సభల ఆమోదం లేకుండా మండలంలో జరుగుతున్న భూ సేకరణ, కంపెనీ నిర్మాణ పనులను వెంటనే నిలుపు చేయాలంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు బుధవారం మాన్విద్కర్ సామాజిక మంచ్ నిర్వహించిన సమావేశానికి పెద్ద ఎత్తున వివిధ గ్రామాల ప్రజలు హాజరయ్యారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం డిఎల్ పురంలో ఆ గ్రామ రెవిన్యూ సర్వే నెంబరు 81 లో సుమారు 1090 ఎకరముల గోబందా కామా అల్లు పరలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాన్విద్కర్ సామాజిక మంచ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అయిన మహేశ్వర సింగ్ మాట్లాడుతూ ఏపీఐఐసీ వారి ద్వారా ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంటు, బల్క్ డ్రగ్ ఫార్మా కంపెనీల యొక్క అవసరాలను తీర్చు నిమిత్తం ఏర్పాటు చేయనున్న నీటి నిల్వల ట్యాంకు గురించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో నిర్మాణం కాబోతున్న స్టీల్ ప్లాంట్, ఫార్మా కంపెనీ, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు వారు ఆర్థిక సహాయంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు జీవనం గడుపుతున్నటువంటి మరే ఇతర భూములలోనైనా ఈ వాటర్ సదుపాయం కోసం ఏర్పాటు చేయుచున్నటువంటి ప్రాంతాలలో నష్టపోవుచున్న పేదలకు గాని పబ్లిక్ ఓనర్స్ కానీ నివాసాలు ఏమన్నా ఉంటే ఆ నివాసాలకు కానీ ముందస్తుగా నోటీసులు ఇచ్చి ఈ ఎస్టిమేషన్లు తయారుచేసి ఆయా ప్రజలతో చర్చలు జరిపిన తర్వాత వారికి తగినటువంటి పరిహారం చెల్లించాలని ఏషియన్ బ్యాంకు ఆదేశాలున్నప్పటికీ వాటిని అతిక్రమించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని పనులు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై రానున్న రోజుల్లో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.




## సీతయ్య పేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

**బుచ్చియ్యపేట జయ జయహే**

బుచ్చియ్యపేట మండలం సీతియ్యపేట గ్రామంలో రామాలయం వద్ద బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మాజీ సర్పంచ్ కరణం నాగేశ్వరరావు నేతృత్వంలో సీతయ్య పేటలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు చుట్టుపక్కల గ్రామాలు నుండి 100 మందికికంటి పరీక్షలు నిర్వహించారు.వారికి ఉచితంగా మందులు పంపిన చేసారు. వారిలో 38 మందిని ఆపరేషన్ నిమిత్తం తరలించారు.ఈ కార్యక్రమం లో పాల్గున్నావారాద్దరికీ మజ్జిగ ప్యాకెట్, లేస్సిలు సత్యసాయి భజనమండలి వారు అందించారు. ఈ కార్యక్రమం లో సత్యసాయి భజన మండలి అధ్యక్షులు యలమర్తి సతీష్ బాబు, చంద్ర, వాసు, పిల్లా పైడికొండ, నందవరపు సంజీవరావు, లోవరాజు, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఆశ కార్యకర్త రామాలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గున్నారు. గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించిన శంకర్ ఫౌండేషన్ టీమ్ కు, సహకరించిన స్థానిక మాజీ సర్పంచ్ కరణం నాగేశ్వరరావుకు స్థానిక నాయకులు పెద్దల అందరూ కృతజ్ఞతలు తెలిపారు.



## దేశ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి

**అరకు (జయ జయహే)**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకు వ్యాలీ జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యా కమిషనరేట్ ఉత్తర్వుల మేరకు 80వ స్వాతంత్ర దినోత్సవ 2026 పార్ట్నర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్ (దేశ నిర్మాణంలో భాగస్వాములు) కార్యక్రమంలో భాగంగా కళాశాలలో హర్ గర్ తిరంగా కార్యక్రమంలో కళాశాలపై మువ్వన్నెల జెండాను ఎగురవేశారు ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన అనే నేను వీడియో క్యాంపెయిన్ లో భాగంగా అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు.. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె నిర్మల ఎన్ఎస్ఎస్ పిఓలు వై విజయలక్ష్మి, బి లచ్చన్న, అధ్యాపకులు ఎస్ రాజు, వి కామేశ్వరరావు, ఎస్ సోంబాబు, ఎస్ దొన్ను, ఎస్ అప్పారావు కె అంబికా, ఎస్ సురేష్, వసంత , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.





## చోడవరంలో హర్ ఘర్ తిరంగా.. ర్యాలీ

### వెల్లివిరిసిన దేశభక్తి తిరంగ ర్యాలీ

**చోడవరం ఆగస్టు 12 జయ జయహే**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం చోడవరం పట్టణంలోనూ, నియోజకవర్గంలో నూ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీలు నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాజు పిలుపునిచ్చారు




## రైతుకు భరోసా పాసు పుస్తకం

**జయ జయహే**

రైతుకు తమ భూమి హక్కుకు అవసరమైన ఆధారం ఒక పాస్ పుస్తకం అని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు చెప్పారు. బుధవారం చోడవరం లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. మొత్తం చోడవరం రెవెన్యూ పరిధిలో 1432 పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు శ్రేయస్సుకు వారి సంక్షేమానికి జవాబుదారీతనానికి పాసుపుస్తకాలు ఎంత అవసరమని అలాంటి పాస్ పుస్తకాలను దుర్వినియోగం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకొని, ప్రజా సంక్షేమం గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జీవి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ సిద్ధి లింగేశ్వర స్వామికి ఘనంగా నిర్వహించిన సహస్ర ఘట్టాభిషేకం

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక మెయిన్ రోడ్ లో గల శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆలయం పక్కన గల శ్రీ శ్రీ సిద్ధి లింగేశ్వర స్వామి దేవాలయంలో ఆ సిద్ధి లింగేశ్వర స్వామికి బుధవారం ఘనంగా సహస్రఘట్టాభిషేకం నిర్వహించడం జరిగింది . ముందుగా గణపతి పూజ పుణ్యాహవాచనం సర్వదేవతల మండప ఆవాహన పూజ సిద్ధి లింగేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక పంచామృత అభిషేకాలు విభూది అభిషేకం, గందాభిషేకం, హరిద్వర్నా అభిషేకం ఆ అనంతరం సహస్ర ఘట్టాభిషేకం వేద పండితులు వేదమంత్రో చరణల మధ్య ఆలయ ప్రాంగణం లో సన్నాయి మేళంతో సహస్ర కలశాలతో ప్రదక్షిణ పూర్వకంగా ప్రదక్షిణ నిర్వహించి స్వామివారిని జలాలతో నింపి జలాభిషేకం నిర్వహించడం



జరిగింది లోక కళ్యాణార్థం వర్షాలు సకాలంలో కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా అభివృద్ధి చెందాలని కోరుతూ.ఈ పూజ నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణాజి మరియు పాలకవర్గ సభ్యులు ఆలయ ఈవో భక్తులు



విశేషంగా పాల్గొని స్వామి వారికి సహస్ర ఘట్ట జలాభిషేకం జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరిగింది ఈ సహస్ర ఘట్టాభిషేకం అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించడం జరిగింది

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు**

**భీమిలి (జయ జయహే)**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు, భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశానుసారం భీమిలి జోన్ 3వ డివిజన్లో పలు పోలింగ్ బూత్ లలో చేపడుతున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో గంటా నూకరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలతో పాటు అదనంగా అవసరమైన అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రభుత్వంగా ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పాటు చేసుకుందని అన్నారు. ఎన్టీఆర్ సామాజిక ఫింఛన్లు దగ్గర నుండి తల్లికి వందనం, దీపం పథకం ద్వారా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, బస్సులలో ఉచిత ప్రయాణం కోసం స్త్రీ శక్తి పథకం, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో 10,000 నుండి 20,000 రూపాయలకు పెంచిన మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో ఏటా 15,000 రూపాయలు, చేనేతలకు 200, పవర్ లూమ్ లకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్, పేదల ఆకలి తీర్చే 269 అన్న క్యాంటీన్ల ద్వారా 5 రూపాయలకే రుచికరమైన భోజనం, అన్నదాత సుఖీభవ




ద్వారా ప్రతీ రైతుకి ఏడాదికి 20,000 రూపాయలు, గీత కార్మికులకు మద్యం షాపులు, వడ్డెర్లకు మైనింగ్ లీజుల కేటాయింపు, ఎన్టీఆర్ వైద్య సేవతో పేదలకు ఉచిత వైద్యం, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లక్షల కుటుంబాలకు ఆర్థిక సాయం ఈవిధంగా ఏడాదికి పేదల సంక్షేమం కోసం 89,000 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న దేశంలోనే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువగళం సారధి మన నారా లోకేష్ బాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకొని పాలన సాగిస్తున్నారని మరో రెండు దశబ్దాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండేవిధంగా ఆశీర్వదించాలని గంటా నూకరాజు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ప్రజలకు విజ్ఞప్తి చేసారు.




# జర్నలిస్టులందరికీ ఇళ్లు.. అందరికీ గుర్తింపు!

**పాత్రికేయ సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం లక్ష్యం**

**ఏపీజేఫ్ ఫౌండర్ కృష్ణాంజనేయులు,రాష్ట్ర అధ్యక్షులు శివరాజేష్**

**విశాఖపట్నం, ఆగస్టు 12: (జయ జయహే)**

ఏపీలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్లు, గుర్తింపు లభించేలా కృషి చేయడమే ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) ప్రధాన లక్ష్యమని సంఘం ఫౌండర్, గౌరవాధ్యక్షుడు చెవుల కృష్ణాంజనేయులు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఏపీజేఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు.విశాఖపట్నంలోని ఓ హోటల్లో ఏపీజేఎఫ్ మహాసభ సన్నాహక కార్యక్రమాలపై బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అలాగే జర్నలిస్టుల కోసం ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. 60 ఏళ్లు నిండిన లేదా 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాంకేతిక కారణాలతో ఇంకా అక్రిడిటేషన్ కార్డులు పొందని అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు.అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా ఆయా మీడియా సంస్థలు జారీ చేసే గుర్తింపు పత్రాల ఆధారంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రతి ఏడాది వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా జర్నలిస్టుల రైల్వే పాస్ సమస్యను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ఈ అంశంపై త్వరలో కేంద్ర మంత్రిని కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెవుల కృష్ణాంజనేయులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కీలకంగా మారిన యూట్యూబ్ ఛానళ్ల గుర్తింపునకు స్పష్టమైన విధి విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.



# సంక్షేమమే కూటమి లక్ష్యం: ఆదిరెడ్డి

**రాజమహేంద్రవరం: జయ జయహే**


ఆగస్టు 12:రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలుఅందించడంతో పాటు సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా 'ఇంటింటికీ టిడిపి --ఇంటింటికీ సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా 2వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, 'సూపర్ సిక్స్'తో పాటు సామాజిక భద్రతా పింఛన్ల పెంపు, 'తల్లికి వందనం', 'దీపం-2', మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, 'అన్నదాత సుఖీభవ' వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే అన్న క్యాంటీన్ల విస్తరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ చేపట్టామని చెప్పారు. రాజమహేంద్రవరం నగర అభివృద్ధికి రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పార్కులు, క్రీడా, విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## బాలికను చరబట్టిన ఘటనలో

# ఉద్యోగిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక నెయ్యిల వీధిలో భర్తతో విడిపోయి నివాసం ఉంటున్న తల్లి కూతుర్లు పై శారదా నగర్ కు చెందిన 12వ వార్డు సచివాలయం ఉద్యోగి కె భార్గవ్ ప్రసాద్ తల్లితో అక్రమ సంబంధం ఏర్పరచుకుని ఆమెను లొంగదీసుకోని ఆమె కూతురును కూడా డబ్బు ఆశ చూపి లొంగ దీసు కోవడం జరిగింది పాప తల్లి మరియు సచివాలయ ఉద్యోగి భార్గవ్ ప్రసాద్ మానవత్వం జాలి దయ మరిచి ఆ చిన్న పాపపై పలుమార్లు అత్యాచారం చేసినట్లు అది భరించలేని ఆమె ఆత్మహత్యకు పాల్పడింది వెంటనే తల్లి గమనించి ప్రమాదం నుండి ప్రాణాలు కాపాడుటకు వెంటనే స్థానిక ప్రైవేట్ హాస్పిటల్లో జాయిన్ చేయడం జరిగింది. ఈ విషయం ఆ నోట ఈ నోట అందరికీ తెలియడంతో పోలీసులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేయడం జరిగింది . విషయం అంతా తెలుసుకున్న పోలీసులు సచివాలయ ఉద్యోగి భార్గవ్ ప్రసాదును పాప తల్లిని అదుపులోకి తీసుకొని అలాగే హాస్పటల్లో చికిత్స పొందుతున్న పాపను కూడా విచారణ చేసి తల్లి సచివాలయం ఉద్యోగి వారు చేసిన నిర్వాకం తెలుసుకుని పోలీసులు వారి పై అధికారి డిఎస్పి కి జరిగిన సంఘటన విషయం తెలపడంతో డి.ఎస్.పి ఆదేశాల మేరకు వీరిని అరెస్టు చేయడం జరిగింది ప్రసాద్ పై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేయడం జరిగింది ప్రసాద్ కూడా భార్యని వదిలి దూరంగా ఉంటున్నట్టు తెలియ వచ్చింది. ప్రజలందరూ ఈ విషయం తెలిసి ఆ పిల్ల తల్లిని నానా శాపనార్థాలు పెడుతున్నారు ఇలాంటి తల్లి ఉ



ంటుందా ఇలాంటి పనులు చేస్తుందా ముక్కుపచ్చ లారని చిన్నపిల్ల పై ముక్కు మొహం తెలియని వ్యక్తితో అత్యాచారం చేయిపిస్తుందా అలాంటి అమ్మను కఠినంగా నాయ స్థానాలు శిక్షించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు సదరు అలాగే సదరు సచివాలయ ఉ ద్యోగని కూడా జైలు నుంచి బయటికి రాకుండా కఠినంగా శిక్షించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు పాప హాస్పిటల్ నుండి కోలుకున్నాక తగిన రక్షణ కల్పించి ప్రభుత్వ న్యాయస్థానాల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుని పాపకు సమాజంలో గౌరవంగా బ్రతికేలా సకల ఏర్పాట్లతో ఉన్నత విద్యను అందించడం జరుగుతుందని పోలీసులు పేర్కొన్నారు



# చోడవరం స్వచ్ఛ పదం

**చోడవరం ఆగస్టు 12 జయ జయహే**

స్వచ్ఛ పదం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చోడవరం పిల్లా వారీ తోట సెకండ్ లైన్ లో రోడ్డుకి అడ్డంగా ఇరువైపులు ఉన్న చెట్లు తొలగించి, అక్కడున్న కాలువలో పేరుకుపోయిన మురుగును బయటకి తీశారు. అక్కడున్న ప్రజలకు తడి చెత్త ,పొడి చెత్త మీద అవగాహన కల్పించారు. తీసిన చెత్త, చెట్లు ట్రాక్టర్ ద్వారా దూరంగా తరలించుటకు చర్యలు చేపట్టారు. అయినది... ఈ కార్యక్రమంలో ఈఓ,గంగాధర్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో 20 ఆలయాలుకి ఆరు కోట్లు మంజూరు

**మాడుగుల ఆగస్టు 12 జయ జయహే**




మాడుగుల నియోజకవర్గంలో, మాడుగుల,చీడికాడ, కె కోటపాడు మండలాల్లో శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి కృషితో శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 20 ఆలయాలకు 6 కోట్ల రూపాయలు మంజూరు అయినట్టు ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం తెలిపింది. వాటిలో మాడుగుల మండలంలో 3 ఆలయాల కు 80 లక్షల రూపాయలు,చీడికాడ మండలంలో 15 ఆలయాలకు 4 కోట్ల 40 లక్షల రూపాయలు, కే కోటపాడు మండలంలో 2 ఆలయాలకు 80 లక్షల రూపాయలు మంజూరయ్యని పేర్కొన్నారు.కాగా మాడుగుల గ్రామంలో పోతురాజు గుడి నిర్మాణానికి 40 లక్షల రూపాయలు, గంగాదేవి గుడి నిర్మాణానికి 20 లక్షల రూపాయలు ఎమ్మెల్యే బండారు కృషితో మంజూరు కావడం పట్ల పట్టణ టిడిపి అధ్యక్షుడు పుప్పాల లక్ష్మి నారాయణ హర్షం వ్యక్తం చేస్తూ.. ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు.




# అర్హత గల వాటర్లను తొలగిస్తే మరల దరఖాస్తు చేసుకోండి

**మాడుగుల ఆగస్టు 12 జయ జయహే**

మండల తెలుగుదేశం పార్టీ సమావేశం మాడుగుల.వివరాలు., ఎస్ ఐ ఆర్ ముసాయిదా వాటర్ లిస్ట్ ను పరిశీలించి తప్పులు ఉంటే సవరణదరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మన్ పి అప్పలరాజు పార్టీ కార్యకర్తలకు సూచించారు. బుధవారం మాడుగులలో జరిగిన మండల తెలుగుదేశం పార్టీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. అర్హులైన ఓటర్లను తొలగిస్తే మళ్లీ దరఖాస్తుచెయ్యాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా చేర్చాలనీ సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు ఏళ్ల అభివృద్ధి సంక్షేమం తెలుగుదేశం కార్యక్రమంలో డోర్ టు డోర్ కార్యక్రమం మరింత ఉధృతంగా చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి పి రమేష్ మాట్లాడుతూ..శ్రీ శక్తి ప్రారంభించి సంవత్సరం అయిన సందర్భంగా సదరు పథకశీ విజయవంతం గురించి ప్రతి కుటుంబానికి తెలియజేయాలనీ, కూటమి పార్టీలో వైయస్సార్ పార్టీ నుండి చేరిన కొంతమంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తూ కుటుంబంలో గొడవలు సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నా నేపథ్యంలో కార్యకర్తలు అందరూ సంయమనం పాటించలని సూచించారు. అలాంటి వారిని గుర్తించి కూటమి అధిష్టానానికి తెలియజేస్తే ఏ పార్టీ వారిని ఆ పార్టీ వారు తగు చర్యలు తీసుకుంటారన్నారు. మండలంలో 18 అంగన్వాడి సెంటర్లకు 12 లక్షలు చొప్పున, 3 దేవాలయాలకు 80 లక్షలు మంజూరు చేయించిన మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి కి మండల పార్టీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి వడ్డే రాజకుమార్, పాలకుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# హజ్ ఇన్ స్పెక్టర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

### ఆన్ లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
### కేంద్ర హజ్ కమిటీకి దరఖాస్తు చేసుకోండి
### మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి,ఆగస్టు12 (జయ జయహే )**

పవిత్ర హజ్-2027 యాత్రకు సౌదీ అరేబియాలో హాజీలకు సేవలు అందించేందుకు రాష్ట్ర హజ్ ఇన్ స్పెక్టర్ల (ఎస్ హెచ్ ఐఎస్)ఎంపికకు దరఖాస్తులను హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఆహ్వానించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ఎస్ హెచ్ ఐఎస్ లు గా పనిచేయడానికి అర్హులైన ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఈనెల 13వ తేదీ నుండి వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు స్వీకరణ ప్రారంభం అవుతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణకు 27 వ తేదీని గడువుగా కేంద్ర హజ్ కమిటీ నిర్ణయించిందన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షను సెప్టెంబర్ 6వ తేదీన హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ, వ్యక్తిత్వ పరీక్ష, వైద్య పరమైన దృఢత్వ



పరీక్ష లను సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు కేంద్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. స్టేట్ హజ్ ఇన్స్పెక్టర్లుగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ముస్లింలై ఉండాలని , గుర్తింపు పొందిన విద్యా సంస్థ నుంచి పట్టబద్రులుగా ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. దరఖాస్తు ప్రారంభ తేదీ నాటికి 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని,చెల్లుబాటు అయ్యే భారత అంతర్జాతీయ పాస్ పోర్టు, కంప్యూటర్ పరిజ్ఞానం, హజ్ ఆచారాలు,లాజిస్టిక్స్ పైన అవగాహన ఉండాలన్నారు. ఆంగ్ల భాష,ఉర్దూ, హిందీ లేదా స్థానిక భాషల్లో ప్రావీణ్యం ఉండాలని,అరబిక్ భాష తెలిసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఎంపిక పక్రియ లో కంప్యూటర్ పరీక్ష కు 170 మార్కులు, ఇంటర్వ్యూ/ వ్యక్తిత్వ పరీక్ష కు 30 మార్కులు, వైద్య ధ్రుడత్వ పరీక్ష ద్వారా ఎంపిక పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర హజ్ కమిటీలు,వక్ఫ్ బోర్డుల ఉద్యోగులకు 5 శాతం సీట్లు రిజర్వు చేయబడ్డాయని తెలిపారు. ఎంపికైన ఎస్.హెచ్.ఐ.ఎస్ లకు 03.04.2027 నుంచి 25.06.2027 వరకు రెండు నెలలపాటు సౌదీ అరేబియాలో విధులు ఉంటాయన్నారు.అక్కడికి ప్రయాణం,వసతి, అవసరమైన రవాణా సౌకర్యాలతో పాటు నిర్దేశించిన 3,100 సౌదీ అరేబియా రియాల్ ల స్థిర భత్యం అందించబడుతుందని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన , ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్ సైట్ https://hajcommittee.gov.in ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆఫ్ లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించబడవని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.



## ఘనంగా స్వర్గీయ జలుమూరి అప్పారావు 12వ వర్ధంతి..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 13,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం సింగవరం గ్రామంలో స్వర్గీయ జలుమూరి అప్పారావు 12వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, యు. చీడిపాలెం పీహెచ్సీ వైద్యాధికారి హేమంత్, కొయ్యూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల 1,2 ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,దట్టెం మురళీకృష్ణ, పలువురు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొని ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వారి చేతుల మీదుగా గ్రామంలోని వితంతువులకు, మహిళలకు చీరల పంపిణీ చేశారు. అనంతరం అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జలుమూరి కుటుంబ సభ్యులు నాగేశ్వరరావు, గణబాబు, వెంకటగిరి, గోవిందరావు, ఆనందబాబు, వెంకటేష్, విజయ్, ఆదిత్యలి తదితరులు పాల్గొన్నారు.



# గాలిపటాల్లో మహిళల గళం

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు 12**

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కా లాంబా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'మా తుఝే సలాం ఉడాన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలోని కృష్ణసాయి కళ్యాణ మండపంలో బుధవారం మహిళల ఆలోచనలకు రెక్కలు తొడిగేలా వినూత్న కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్టేట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమర్ జహాబేగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థినులు హాజరయ్యారు. గాలిపటాలపై మహిళల ఆలోచనలు, ఆశయాలు, స్వేచ్ఛ, హక్కులు, భద్రత, సమానత్వంతో పాటు మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అక్షరాలు, చిత్రాల రూపంలో సృజనాత్మకంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్ జహాబేగ్ మాట్లాడుతూ, 79 ఏళ్ల స్వాతంత్ర్య ప్రస్థానంలో మహిళలు సాధించిన హక్కులు, స్వేచ్ఛ, భద్రతను గాలిపటాల ద్వారా ప్రతిబింబించడం గర్వకారణమన్నారు. మహిళల సమస్యలు, ఆకాంక్షలను సమాజానికి చేరవేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాజమహేంద్రవరం మెడికో డాక్టర్ ప్రియాంక హత్య ఘటనను కూడా గాలిపటం రూపంలో ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళలపై జరిగే అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూపొందించిన గాలిపటాలను క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని నిర్వాహకులు సూచించారు. ఎంపికైన వారిని ఆగస్టు 15న ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమానికి తీసుకెళ్లనున్నట్లు అమర్ జహాబేగ్ తెలిపారు. ఉత్తమ గాలిపటాలకు మొదటి బహుమతిగా రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేల చొప్పున ఇద్దరికి, మూడో బహుమతిగా రూ.30 వేల చొప్పున ముగ్గురికి ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా పార్లమెంటరీ కోఆర్డినేటర్ టీకే విశ్వేశ్వర్ రెడ్డి, అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా సారథి, నిడదవోలు కాంగ్రెస్ ఇన్‌చార్జి భద్రం దొర, మహిళా నాయకురాలు జయలలిత తదితరులు పాల్గొన్నారు.



### అట్టహాసంగా ప్రారంభమైన
# వాలీబాల్ పోటీలు

**మునగపాక, ఆగస్టు 12, జయ జయహే:**

మునగపాకలో ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం రాత్రి అట్టహాసంగా మొదలయ్యాయి. గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పోటీలను టిడిపి మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగ పురోభివృద్ధికి ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ మాట్లాడుతూ అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన టీమ్ లు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడారి కాశిబాబు, పిల్లి అప్పారావు, ఆడారి సూర్య చంద్ర రామారావు, రాంబాబు గంగ మహేష్, వెలగా శ్రీనివాసరావు, కెవిఎస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి పుట్టినరోజు వేడుకలు

**అనకాపల్లి (జయ జయహే)**

అనకాపల్లి చినరాజుపేటలో శ్రీ చౌడేశ్వరి, సాంబశివ దేవాలయంలో ఆషాడ అమావాస్య బుధవారం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి పుట్టినరోజు వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఉదయం ఐదు గంటల నుండి అభిషేకములు మరియు 108 కలిశాభిషేకం కుంకుమ పూజలు, సంకీర్తనలు అలాగే అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో అమ్మవారి పుట్టినరోజు వేడుకలు అశేష భక్తుల సమక్షంలో ఎంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. మరియు భక్తుల భూరి విరాళంతో చౌడేశ్వరి సాంబశివుల ఊరోగింపునకు ప్రత్యేక రధం తయారుచేసి ప్రారంభించడం జరిగింది. అనంతరం అమ్మవారు అయ్యవారు పురవీధులలో ఊరేగింపుగా వెళ్ళింది. ఈ కార్యక్రమం అంతా చౌడేశ్వరి సాంబశివ దేవాలయ కమిటీ మరియు ప్రధాన అర్చకులు కొమళ్ళపల్లి నందన్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .





### అంగన్‌వాడీ కార్యకర్తలకు
## 'జ్ఞాన జ్యోతి' శిక్షణ

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 13,**

అల్లూరి జిల్లా కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజులపాటు నిర్వహించనున్న జ్ఞాన జ్యోతి' శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం సీఏహెచ్ పాఠశాలలో ప్రారంభించారు. ఈ శిక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సేవలను సక్రమంగా అందించాలని సీడీపీఓ దేవమణి సూచించారు. ఈ ఆరు రోజుల శిక్షణలో పోషణ, ఆరోగ్యం, బాలల అభివృద్ధి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పిస్తారు.

## హెప్సిబా రాణి నీ.కలిసిన చైర్మన్ బత్తుల

**చోడవరం ఆగస్టు 12 జయ జయహే**



రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి హెప్సిబా రాణి కొర్లపాటిను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి పదవీకాలంలో రాష్ట్రంలో గృహ నిర్మాణ రంగం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదల సొంతింటి కలను సాకారం చేసే కార్యక్రమాలు, గృహ నిర్మాణ పనుల పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు.ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్ కార్యాచరణపై సానుకూలంగా చర్చ జరిగినట్లు బత్తుల తాతయ్య బాబు తెలిపారు.

## బాల్యవివాహాలతోనే మాతృ, శిశు మరణాలు.

**బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 12,జయ జయహే.**




బాల్యవివాహాలతోనే మాతృ, శిశు మరణాలు సంబవిస్తున్నాయని ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు తెలిపారు.మండలంలోని ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్వాడీ టీచర్లకు సూపర్వైజర్లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్ ఆదేశాల తో ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు వారికి బాల్యవివాహాలు అరికట్టాలని అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బుచ్చినాయుడు కండిగ మండలంలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నందున యుక్త వయసులోనే గర్భము ధరించి శిశు మరణాలు జరుగుతున్నాయన్నారు. 21 సంవత్సరముల తరువాత అమ్మాయిలు వివాహము చేసుకోవాలని ప్రభుత్వం వారు నిర్ణయించడం జరిగినదన్నారు ,

# జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు

**పాయకరావుపేట, ఆగస్ట్ 12**

మెదక్ జిల్లా, తూప్రాన్‌లో ఆగస్టు 8 నుంచి 10 వరకు నిర్వహించిన సీబీఎస్ఈ ఖో-ఖో క్లస్టర్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. అండర్-19 బాలుర విభాగంలో ఉత్సాహభరితంగా పోటీపడిన శ్రీ ప్రకాష్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని బంగారు పతకాలను సాధించింది. గత 10 సంవత్సరాల నుండి సీబీఎస్ఈ ఖో-ఖో క్లస్టర్ పోటీల్లో వరుసగా శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకుంటూ రికార్డు సృష్టించడం విశేషం. పోటీల్లో విద్యార్థులు క్రమశిక్షణ, సమన్వయం, వేగం, వ్యూహాత్మక నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం సాధించారు. జట్టు సభ్యుల సమష్టి కృషి, నిరంతర సాధన, కోచ్ మార్గదర్శకత్వం ఈ విజయానికి ప్రధాన కారణమయ్యాయి. క్లస్టర్ స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించి, తమిళనాడులో సెప్టెంబర్ 19 నుంచి 23 వరకు నిర్వహించనున్న ఖో-ఖో పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను కోచ్ ఎల్ చిరంజీవిని విద్యాసంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.



మూర్తి, ప్రిన్సిపాల్ కె. రవి తదితరులు అభినందించారు. విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలోనూ రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## "బొండా చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో

# కుంచమాంబ తల్లికి బోనాలు సమర్పణ



**వడ్లపూడి (జయ జయహే)**

బొండా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వడ్లపూడి లో కొలువై ఉన్న భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారు తల్లి శ్రీ కుంచమాంబ అమ్మవారికి పెద్ద ఎత్తున శోభా యాత్రతో బోనాలు అంగ రంగ వైభవంగా సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కోలాటాలు, డప్పులు ధూప, దీప నైవేద్యంలు, సారె ఊరేగింపుతో వెళ్లి భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్ పర్సన్ బొండా శ్రీదేవి మాట్లాడుతూ వడ్లపూడి ఆర్ హెచ్ కోలని ప్రజలను నిత్యం కంటి పాపల్లా కాపాడుతూ, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు తల్లికి బోనాలు సమర్పించుకొని అందర్నీ చల్లగా చూడాలని వేడుకోవడం జరిగిందని అన్నారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు బొండా యల్లాజీరావు మాట్లాడుతూ ప్రపంచం అంతా యుద్ధ భయంతో నిరాశ, నిస్పృహలతో దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షు చందంగా, తిండికి కూడా నోచుకోని పరిస్థితిలో ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీజీ దేశాన్ని విశ్వ గురువుగా నిలిపి రామరాజ్యం స్థాపన దిశగా వెళుతున్నారు. రాష్ట్రములో కూడా కూటమి ప్రజా రంజక పాలన చేస్తూ రాష్ట్రము అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహకారంతో నిరంతరం శ్రమిస్తున్నారు.గాజువాక నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా కృషి చేస్తున్నారు.బోనాలు అనేవి తెలంగాణ రాష్ట్రము లోనే ప్రసిద్ధి, మన రాష్ట్రములో కూడా ప్రజల ను ఆధ్యాత్మిక భావాల వైపు చైతన్య పరచే దిశగా ఈ కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొండా జగన్ ,లక్ష్మి,గ్రామ పెద్దలు జెర్రిపోతుల ఈశ్వరరావు, ఈర్లి శ్రీరాములు, బొండా అప్పలనాయుడు, మింది గోవింద్, కర్రి కృష్ణ, గొంతిన వీరునాయుడు,మింది కుమార్, రాజుగారు, కళ,షేక్ బీబీ,గాలి నూకరాజు,బొండా గోవిందరాజు, శ్రీదేవి, కొరారి వరలక్ష్మి, అభిషేక్, అర్జి సూరిబాబు,నానేపల్లి కుమారి, ఉదయ, శ్యామల, షాలిని, వరలక్ష్మి,భార్గవి,ములగపాక రామలక్ష్మి, పార్వతి,జయలక్ష్మి,సుధ,ఉమ,లీలావతి,గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



## వైఎస్ జగన్‌ను కలిసిన పెళ్లకూరు వైస్సార్సీపీ నాయకులు

**పెళ్లకూరు,ఆగస్టు12,జయ జయహే:**

పెళ్లకూరు మండల వైఎస్సార్సీపీ నాయకులు సాగి జితేంద్ర నాయుడు,బండి బాలు,అట్ల గోపాల్,తెల్లగూటి ప్రభాకర్, తెల్లగూటి నాగార్జున,తోట కిరణకుమార్,మాజీ డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉండవల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పెళ్లకూరు మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు,నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఎన్నికల కార్యాచరణ ప్రణాళికలపై అధినేతతో కూలంకషంగా చర్చించారు.పార్టీ బలోపేతానికి,ప్రజల తరఫున నిరంతరం పోరాడేందుకు తగిన సూచనలు మరియు మార్గదర్శకాలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకులకు అందించారు.



## ముస్లిం స్మశాన వాటిక కబ్జా

### పట్టించుకోని రెవిన్యూ అధికారులు

**బుచ్చయ్యపేట జయ జయహే**

బుచ్చియ్య పేట మండల కేంద్రంలో ముస్లింలు తరతరాలుగా వినియోగిస్తున్న స్మశాన వాటికను ఆక్రమణకు గురి కావడంతో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈ సాంబశివరావు, వ్యతిరేక పోరాట సంఘం నాయకులు శంకర్రావు తో కలిసి బుచ్చియ్య పేటలో పర్యటించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 228/9 లో తరతరాలగా స్మశాన వాటిని ఆక్రమించి మొక్కలను నాటారని అన్నారు.భూములు విలువ పెరగడంతో దళితులు,మైనారిటీల వంటి వారి స్మశాన వాటికలను కబ్జాలు చేయడం అనవయితుగా మారిపోయిందని శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ముస్లింలకు స్మశాన వాటిక యాళ్ల తరబడి తమ పూర్వక నుండి నేటి వరకు అక్కడే ఖననం చేస్తున్నాప్పటికీ ఆక్రమణ చేసిన వారిపై అధికారులు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన నేటికి దీనిపై అధికారులు తగిన చర్య తీసుకోలేదని అన్నారు. అధికారుల వెంటనే స్మశానంతో పాటు ఆ చుట్టుపక్కల ఉన్న బంజరు భూములను సర్వే నిర్వహించి ముస్లింలకు స్మశాన వాటికి 20 సెంట్లు స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే వీరు తరపున ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేక్ రెహమాన్, అజిత్, పీరు సాహిబ్ సాహిబ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## డీపీచాక్లెట్ కంపెనీలో యువకుడి మృతి

**వరదయపాలెం, ఆగస్టు 12,జయ జయహే.**



బి.యన్. కండ్రిగ మండలం వెస్ట్ వరత్తూరుకు చెందిన కనపర్తి సునీల్(33) డీపీ చాకోలెట్ కంపినిలో మృతిచెందాడు.వరదయ్య పాలెం మండలంలోని డీపీ చాక్లెట్ కంపెనీలో సునీల్ పనిచేస్తున్నాడు. అక్కడ జరిగిన ప్రమాదంలో చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు.భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమని కార్మికులు ఆరోపించారు. సునీల్ మృతితో భార్య, ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారయ్యారు. రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరారు.



## యాదవుల కల్లాల వద్ద తాగునీటి బోరు ఏర్పాటు

**బుచ్చయ్యపేట జయ జయహే**

వడ్డాది గ్రామంలోని యాదవుల కల్లాల వద్ద బుధవారం తాగునిటీ బోర్ ఏర్పాటు చేశారు. జడ్పిటిసి జండా రాంబాబు సిఫారసు పి ఎల్ సి నుంచి బోర్వెల్ మంజూరు చేశారు. జడ్పిటిసి జొండ రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యలు తాలెత్తకుండా కుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట మరిన్ని బోర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.పి ఎల్ సి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో దొండా రాంబాబు కల్లాలు వద్ద ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వరి బీమా ప్రీమియం

# ఎకరానికి 638 రూపాయలు..

### గడువు ఇక నాలుగు రోజులే..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 13,**



ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు ఈ నెల 15తో ముగియనుంది అని మండల వ్యవసాయ అధికారి పి. శివరాం ప్రసాద్ తెలుపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో వరి సాగు చేసిన రైతులు పంటల బీమాలో నమోదు చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం అని తెలిపారు. బీమా కోసం పంట సాగుపై,స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి అని గడువు లోపు 638 రూపాయల ప్రీమియం చెల్లించాలి అని తెలిపారు. ఎల్ నినో పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కోసం ప్రతి రైతు పంటల బీమాలో తప్పనిసరిగా నమోదు కావాలని ఏంఏఓ సూచించారు. పంట రుణం తీసుకున్న రైతులు తమ బ్యాంకు అధికారిని సంప్రదించి బీమా చేయించుకోవాలి అన్నారు. పంట రుణం తీసుకోని రైతులు మీ సేవ కేంద్రం నందు బీమా చేయించుకోవచ్చు. కావున కొయ్యూరు మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏంఏఓ పి. శివరాం ప్రసాద్ కోరారు.




## జాతీయ స్కాలర్షిప్‌కు రికార్డుగా 25 మంది ఎంపిక

**మునగపాక, ఆగస్టు 12, జయ జయహే:**

మునగపాక మండలం నుండి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ జాతీయ స్కాలర్షిప్ కు రికార్డు స్థాయిలో మునగపాక మండలం నుండి 25 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్కాలర్షిప్ కు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యధికంగా ఏపీ మోడల్ స్కూల్ పాటిపల్లి పాఠశాల చెందిన 15 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. మునగపాక జిల్లా పరిషత్ పాఠశాల నుండి ఐదుగురు, తోటాడ, తిమ్మరాజుపేట, నాగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఇద్దరు చొప్పున, వీరికి ఏడాదికి 12,000 చొప్పున నాలుగు సంవత్సరాలు ప్రభుత్వం స్కాలర్షిప్ ను అందిస్తుంది. ఎక్కువమంది ఈ స్కాలర్షిప్ కు మునగపాక మండలం నుండి ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆఫ్‌లైన్ టికెట్ల మంజూరుకు దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 12,జయ జయహే.**



శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్ టికెట్ల మంజూరు, గిరి ప్రదక్షిణ రహదారిపై సోలార్ లైట్లు ఏర్పాటు, గొడ్డేరు కాలువపై బ్రిడ్జ నిర్మించుటకు ట్రాఫిక్ మళ్లింపు కోసం అనుమతిని ఇవ్వాల్సిందిగా దేవాదాయ శాఖ కమిషనర్ కి ట్రస్ట్ బోర్డు చైర్మన్ సాయి ప్రసాద్ వినతిపత్రం అందజేశారు.

## గడపగడపకు టీడీపీ కార్యక్రమంలో

# ప్రతి ఒక్కరు పాల్గొనాలి

### బీమరశెట్టి శ్రీనివాసరావు



**మునగపాక, ఆగస్టు 12, జయ జయహే:**

మునగపాక గడపగడపకు తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. పెంటకోట విజయ్ అధ్యక్షతన మునగపాకలో టిడిపి కార్యాలయంలో మండల టిడిపి సమావేశం బుధవారం జరిగింది. గడపగడపకు తెలుగుదేశం కార్యక్రమం షెడ్యూల్ ను రూపొందించారు. గడపగడపకు తెలుగుదేశం కార్యక్రమంలో ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతగా పాల్గొనాలి అని రాష్ట్ర గవర కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ బీమరశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, అధికార ప్రతినిధి ఆడారి జానకి, రేబాక మాలతి, డొక్కా నాగభూషణం, దొడ్డి రమేష్, డివి రమణ, కాండ్రేగుల శంకర్, రాజు నాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి టౌన్‌లో పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌పై

# దాడికి యత్నించిన ఇద్దరు యువకుల అరెస్ట్

- ప్రధాన నిందితుడు అచ్చి శ్రీనివాసులు, జితేంద్ర కుమార్ లు అరెస్ట్.
- నేరానికి ఉపయోగించిన కత్తి స్వాధీనం.

**తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల తో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు.**

**శ్రీకాళహస్తి, ఆగస్టు 12,జయ జయహే.**



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి టౌన్‌లో పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసి, కత్తితో పొడిచేందుకు యత్నించిన ఇద్దరు యువకులను శ్రీకాళహస్తి ఒన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. 11.08.2026వ తేదీ సాయంత్రం సుమారు 04:45 గంటల సమయంలో శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ నుంచి 112కు కాల్ రావడంతో, ఒక వ్యక్తి తన ల్యాప్‌టాప్ రైల్వే స్టేషన్‌లో దొంగతనానికి గురైనట్లు సమాచారం ఇచ్చాడు. సదరు కాలర్‌ను కలిసేందుకు శ్రీకాళహస్తి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ రమణయ్య మోటార్ బైక్‌పై రైల్వే స్టేషన్ వైపు వెళ్తుండగా, రైల్వే స్టేషన్‌కు ఎదురుగా తిరుపతి--శ్రీకాళహస్తి ప్రధాన రహదారిపై హ్యాపీ కిచెన్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురై, సంబంధిత వ్యక్తులు గొడవ పడుతున్నట్లు గమనించారు. ఈ క్రమంలో ప్రమాదంలో గాయపడిన దంపతుల్లో బుజ్జమ్మ అనే మహిళను ఆమె భర్త సహాయంతో ఆటోలో ఎక్కించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. అనంతరం ప్రమాదానికి గురైన స్కూటీ రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో దానిని పక్కకు పెట్టించి, దాని తాళాలను హెడ్ కానిస్టేబుల్ తీసుకున్నారు. అలాగే సదరు బండి డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు రావాల్సిందిగా సూచించారు.అంతలో సదరు ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కోపంతో హెడ్ కానిస్టేబుల్ వద్దకు వచ్చి దురుసుగా మాట్లాడటంతో పాటు, ఆయన యూనిఫాం చొక్కాను పట్టుకొని లాగి దౌర్జన్యంగా వ్యవహరిస్తూ దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో శ్రీనివాసులు అనే వ్యక్తి హెడ్ కానిస్టేబుల్‌ను బెదిరిస్తూ, తన నడుము వద్ద ఉన్న కత్తి పౌచ్ నుంచి పిడి బాకును బయటకు తీసి ఆయనపై దాడి చేసి పొడిచేందుకు యత్నించాడు. హెడ్ కానిస్టేబుల్ తృటిలో తప్పించుకోవడంతో ప్రమాదం తప్పింది.ఈ ఘటనపై రమణయ్య ఇచ్చిన స్పెషల్ రిపోర్ట్ ఆధారంగా శ్రీకాళహస్తి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా మొదటి నిందితుడు శ్రీనివాసులను 11.08.2026వ తేదీ రాత్రి 08:00 గంటలకు అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన కత్తిని అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. అలాగే రెండవ నిందితుడు . జితేంద్ర కుమార్‌ను 12.08.2026వ తేదీన అరెస్ట్ చేశారు.పోలీస్ విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేయడం, విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించి, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com